RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com


ఎడిటర్ : పి. సైదులు, సంపుటి : 02 సంచిక : 365 శుక్రవారం 28-11-2025 పేజీలు : 8

## గ్రీన్ కార్డులపై కఠిన పరిశీలన.. ట్రంప్ సంచలన నిర్ణయం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలస విధానాలపై సంచలన నిర్ణయం తీసుకున్నారు. వైట్‌హౌస్ సమీపంలో ఓ ఆఫ్ఘన్ వలసదారుడు జరిపిన కాల్పుల ఘటన నేపథ్యంలో ఆఫ్ఘనిస్థాన్‌తో పాటు మొత్తం 19 దేశాలకు చెందిన గ్రీన్ కార్డ్ హోల్డర్లపై కఠిన పరిశీలనకు ఆదేశించారు. ఇప్పటికే ఆఫ్ఘనిస్థాన్ నుంచి వలస దరఖాస్తులను నిలిపివేసిన ట్రంప్ సర్కార్, మరో 18 దేశాల వారి గ్రీన్ కార్డులను క్షుణ్ణంగా పునఃపరిశీలించనుంది. బుధవారం వైట్‌హౌస్ వద్ద రహ్మానుల్లా లకన్‌వాల్ అనే వ్యక్తి జరిపిన కాల్పుల్లో ఇద్దరు నేషనల్ గార్డ్ సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో సారా బెక్‌స్ట్రామ్ అనే సైనికురాలు గురువారం చికిత్స పొందుతూ మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. కాల్పుల్లో గాయపడిన నిందితుడు లకన్‌వాల్ కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన తర్వాత అమెరికా కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (%ఖూజ×ూ%) డైరెక్టర్ జోసెఫ్ ఎడ్లో గురువారం మాట్లాడుతూ, "ఆందోళనకర దేశాల నుంచి వచ్చిన ప్రతి విదేశీయుడి గ్రీన్ కార్డును కఠినంగా పునఃపరిశీలించాలని అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించారు" అని తెలిపారు. ఈ నిర్ణయంతో దాదాపు లక్షలాది మంది గ్రీన్ కార్డ్ హోల్డర్లపై ప్రభావం పడనుంది. ఈ 19 దేశాల జాబితాలో ఆఫ్ఘనిస్థాన్‌తో పాటు మయన్మార్, ఇరాన్, లిబియా, సోమాలియా, యెమెన్, వెనిజులా వంటి దేశాలు ఉన్నాయి. అయితే, ఈ జాబితాలో భారత్ లేదు. దక్షిణాసియా నుంచి కేవలం ఆఫ్ఘన్ మాత్రమే ఈ జాబితాలో ఉంది.

## ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు: జైలు అధికారుల వెల్లడి

- జైల్లో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మృతి అంటూ వదంతులు
- పుకార్లను ఖండించిన రావల్పిండి అడియాలా జైలు అధికారులు
- ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంగానే ఉన్నారని స్పష్టత కుటుంబ సభ్యులతో భేటీకి అనుమతించాలని పీటీఐ డిమాండ్
- వారాలుగా కలవనివ్వకపోవడంతో సోదరీమణుల ఆందోళన, నిరసన



**పాకిస్థాన్ :** పాకిస్థాన్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ జైల్లో మరణించారంటూ సోషల్ మీడియాలో వ్యాపించిన వదంతులపై రావల్పిం డిలోని అడియాలా జైలు అధికారులు స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని గురువారం స్పష్టం చేశారు. ఆయన్ను జైలు నుంచి ఎక్కడికీ తరలించలేదని, ప్రస్తుతం తమ వద్దే ఉన్నారని తెలిపారు. జైలు అధికారులు విడుదల చేసిన ప్రకటనలో, "ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలు నుంచి తరలించారనే కథనాల్లో వాస్తవం లేదు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు, అవసరమైన పూర్తి వైద్య సంరక్షణ అందిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఆయన

మిగతా 2లో

## హసీనాకు 21 ఏళ్ల జైలు శిక్ష- బంగ్లాదేశ కోర్టు తీర్పు

- షేక్ హసీనాను మరో మూడు కేసుల్లో దోషిగా తేల్చుతూ 21 ఏళ్ల జైలు శిక్ష విధించిన కోర్టు
- ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు
- ఈ వ్యవహారంలో హసీనా అవినీతికి పాల్పడినట్లు తేల్చిన కోర్టు




**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరో మూడు కేసుల్లో 21 సంవత్సరాల జైలు శిక్ష పడింది. ఈ మేరకు హసీనాను దోషిగా తేల్చుతూ బంగ్లాదేశ్ కోర్టు తీర్పునిచ్చింది. ఇప్పటికే మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిన కేసులో మరణశిక్ష విధించగా తాజాగా మరో మూడు అవినీతి కేసుల్లో ఆమెను దోషిగా తేల్చింది. పుర్బాచోల్‌లోని రాజుక్ న్యూ టౌన్ ప్రాజెక్ట్‌లోని ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ హసీనాపై మూడు కేసులు నమోదయ్యాయి. వీటిపై విచారణ జరిపిన బంగ్లాదేశ్ కోర్టు,

మిగతా 2లో

# వామ్మో.. దూసుకొస్తున్న మరో తుఫాన్..

## తెలుగు రాష్ట్రాలపై భారీ ఎఫెక్ట్!..

నైరుతి బంగాళాఖాతం, దానికి అనుకుని ఉన్న శ్రీలంక తీరంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ఉత్తర పశ్చిమ దిశగా కదులుతూ, రాబోయే 3 గంటల్లో తుఫానుగా మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక తెలంగాణలో రాబోయే మూడు రోజల పాటు వాతావరణాన్ని కూడా హైదరాబాద్ వాతావరణ కేంద్ర అంచనా వేసింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఆగ్నేయ శ్రీలంక తీరం సమీపంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం మరింత బలపడి ఇంచుమించు అదే ప్రాంతంలో వాయుగుండం గా మారింది. తదుపరి ఈ వాయుగుండం ఉత్తర వాయువ్య దిశలో కదిలి మరింత బలపడి ఈరోజు ఉదయం 05:30 గంటలకు అదే ప్రాంతంలో తీవ్ర వాయుగుండంగా మారింది. తర్వాత తీవ్ర వాయుగుండం పుదుచ్చేరికి దక్షిణ ఆగ్నేయంగా 640 కి మీ, చెన్నైకి దక్షిణ ఆగ్నేయంగా 730 కి మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది.




ఈ తీవ్రవాయుగుండం ఉత్తర వాయువ్య దిశలో కదిలి మరింత బలపడి ఈ మధ్యాహ్నానికి తుఫాన్ గా మారే అవకాశం ఉంది. 48 గంటలలో ఈ తుఫాను ఉత్తర వాయువ్య దిశలో కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, సమీపంలోని దక్షిణ ఆంధ్ర కోస్తా తీర ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉంది. ఈ తుఫాన్ రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరం మీదుగా ఉత్తర-ఉత్తర పశ్చిమ దిశగా ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరికి ఆనుకుని ఉన్న దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల వైపు కదులుతూ కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో పీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కరిసే అవకాశం ఉంది. తుఫాన్ ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో



## ప్రపంచానికే ఆదర్శం మన యువత..

## వారి వల్లే స్టార్టప్ విప్లవం సాధ్యమైంది

### - ప్రధాని మోదీ

- భారత జెన్-జెడ్ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు
- వారి ఆత్మవిశ్వాసం ప్రపంచానికే ఆదర్శమన్న ప్రధాని
- అంతరిక్ష రంగంలో 300కు పైగా స్టార్టప్‌ల ఏర్పాటు
- దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌లతో మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- యాప్‌ల నుంచి డీప్-టెక్ వైపు యువత అడుగులు

**ఢిల్లీ :** భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ (తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు. దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు.
ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైన ప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు

మిగతా 2లో

## కేసీఆర్ ఓఎస్డీని విచారించిన సిట్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో మళ్లీ విచారణ ప్రారంభించిన సిట్
- కేసీఆర్ ఓఎస్‌డీ రాజశేఖర్‌రెడ్డిని విచారించిన సిట్ అధికారులు
- జూబ్లీహిల్స్ పీఎస్‌లో రెండు గంటల పాటు ప్రశ్నించిన పోలీసులు

2





2

## ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత ఉండాల్సిందే: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు


- ఆన్‌లైన్ కంటెంట్‌కు జవాబుదారీతనం తప్పనిసరి అన్న సుప్రీంకోర్టు సొంత ఛానల్ ఉందని బాధ్యతారాహిత్యంగా ఉండటం సరికాదని కీలక వ్యాఖ్యలు
- యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా వివాదంపై విచారణ వినియోగదారుల కంటెంట్
- నియంత్రణపై కేంద్రానికి ఆదేశాలు నిబంధనల రూపకల్పనకు నాలుగు వారాల గడువు

## రిజర్వేషన్లపై కేటీఆర్ కామెంట్స్.. సీతక్క స్ట్రాంగ్ కౌంటర్



**హైదరాబాద్:** స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను 17 శాతానికి తగ్గించిందన్న కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి సీతక్క స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్ ప్రచారం చేస్తున్నట్లుగా బీసీల రిజర్వేషన్‌లు ఎక్కడా తగ్గలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని.. కానీ 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి తడిబట్టతో బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్ అంటూ విరుచుకుపడ్డారు. ఇప్పుడు బీసీల గురించి

మిగతా 2లో



2లో

## పార్లమెంట్‌లో 'జైహింద్', 'వందేమాతరం' నినాదాలపై ఆంక్షలు

## బీజేపీపై కాంగ్రెస్ ఫైర్

# వామ్మో.. దూసుకొస్తున్న మరో తుఫాన్..

తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా లేదా ఉరుములతో కూడిన జల్లులు, ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఇక దక్షిణ కోస్తాంధ్రా, రాయలసీమలో రాబోయే మూడు రోజులు.. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం కోస్తాంధ్రలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముంది. ఇక శనివారం భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. అలాగే గంటకు 40 -50 కి.మీ వేగంతో ఈదురు గాలులు కూడా వీచే అవకాశం ఉందని తెలిపింది. ఇక తెలంగాణ విషయానికి వస్తే రాష్ట్రంలో గురువారం, శుక్రవారంి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని.. ఆదివారం మాత్రం రాష్ట్రంలోని కొన్ని దక్షిణ జిల్లాలలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్ర వెల్లడించింది.
నైరుతి బంగాళాఖాతంలో, శ్రీలంక తీరానికి సమీపంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థ గురువారం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇది గురువారం సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ తుపానుకు 'దిట్వా' అని నామకరణం చేశారు. ప్రపంచ వాతావరణ సంస్థ సభ్య దేశాల జాబితా ప్రకారం యెమెన్ దేశం ఈ పేరును సూచించింది. యెమెన్‌కు చెందిన సోకోత్రా ద్వీపంలో 'దిట్వా లగూన్' అనే పేరుతో ఒక చాలా ప్రసిద్ధమైన, అందమైన ఉప్పునీటి సరస్సు ఉంది. ఇప్పుడు ఆ ప్రదేశం పేరునే, బంగాళాఖాతంలో ఏర్పడే తుపానుకు పెట్టారు. ప్రస్తుతం సముద్రంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వ్యవస్థ మరింత బలపడి తీరం వైపు కదులుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.
ఈ తుపాను వాయవ్య దిశగా కదులుతూ శ్రీలంక తీరప్రాంతాన్ని దాటి, శనివారం నాటికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరితో పాటు దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం వైపునకు చేరుకుంటుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరప్రాంత ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను కదలికలను నిరంతరం గమనిస్తూ, ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసేందుకు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ సన్నద్ధమైంది. చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, గురువారం దక్షిణ తమిళనాడు, డెల్టా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తీవ్రత మరింత పెరగనుంది.
ముఖ్యంగా డెల్టా, దాని పరిసర జిల్లాల్లో శుక్రవారం నాడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం నాటికి ఈ వాతావరణ వ్యవస్థ తీరం వెంబడి ఉత్తరం వైపు కదులుతున్న కొద్దీ, ఉత్తర తమిళనాడు జిల్లాల్లోనూ భారీ వర్షాలు నమోదవుతాయని అధికారులు వివరించారు. ఇదిలా ఉండగా, ఈశాన్య ఇండోనేషియా, మలక్కా జలసంధిపై కేంద్రీకృతమైన 'సెన్యార్' అనే మరో తుపాను తూర్పు వైపుగా కదులుతోంది. అయితే ఈ తుపాను వల్ల తమిళనాడుకు గానీ, భారత తీరానికి గానీ ఎలాంటి ముప్పు లేదని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

# ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు: జైలు అధికారుల వెల్లడి

ఆరోగ్యంపై వస్తున్న పుకార్లను నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఈ వదంతులపై ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ (పీటీఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని, ఇమ్రాన్‌తో ఆయన కుటుంబ సభ్యుల భేటీని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. గత కొన్ని వారాలుగా ఇమ్రాన్ సోదరీమణులను ఆయన్ను కలిసేందుకు అనుమతించకపోవడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. తమ సోదరుడిని కలిసేందుకు అనుమతించకపోవడంతో ఇమ్రాన్ సోదరీమణులు అలీమా ఖాన్, నూరీన్ ఖాన్, ఉజ్మా ఖాన్ మంగళవారం అడియాలా జైలు బయట గంటల తరబడి నిరసన చేపట్టారు. "లోపల ఏం జరుగుతోందో ఎవరికి తెలుసు? బహుశా ఇమ్రాన్‌ను వేరే చోటుకు తరలించి ఉండవచ్చు. అందుకే మమ్మల్ని కలవనివ్వడం లేదు" అని అలీమా ఖాన్ అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో అరాచక పాలన నడుస్తోందని ఆమె విమర్శించారు. 2022లో అవిశ్వాస తీర్మానంతో అధికారం కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్, అవినీతి, ఉగ్రవాదం వంటి పలు కేసుల్లో 2023 ఆగస్టు నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే.
అదే విధంగా అడియాలా జైలు నుంచి ఇమ్రాన్‌ను తరలించారంటూ వస్తున్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని జైలు అధికారులు తెలిపారు. ఇమ్రాన్‌కు వైద్య సహాయం అందుతుందని, ఆయన పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. మరోవైపు పాక్ రక్షణ మంత్రి ఖవాజ్ ఆసిఫ్ కూడా ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. ఇమ్రాన్ ఖాన్‌ను జైలులో విలాసవంతమైన సౌకర్యాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. బయటి కంటే జైల్లోనే ఆయన సౌకర్యవంతంగా ఉన్నారని, ఫైవ్‌స్టార్ హోటళ్లలో కూడా లభించని మంచి ఆహారాన్ని ఆయన పొందుతున్నారని తెలిపారు.
ఇదిలా ఉండగా ఇమ్రాన్ మరణవార్తలపై బలూచిస్థాన్ విదేశాంగ శాఖ ఎక్స్‌లో పెట్టిన పోస్టు ఊహాగానాలను మరింత పెంచింది. పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఇమ్రాన్‌ను హతమార్చినట్లు వార్తలు వస్తున్నాయని పోస్ట్‌లో పేర్కొంది. అంతేకాకుండా పలు మీడియా సంస్థల్లో కూడా వార్తలు రావడంతో ఇమ్రాన్ మద్దతుదారులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. అయితే జైలు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఆయన మరణ వార్తలు మరింత ఊపందుకున్నాయి.

**గతంలో ఏం జరిగింది? ఇమ్రాన్ ఎందుకు జైలుకు వెళ్లారు?**

కాగా, పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్నారు. అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్, ఆయన సతీమణి బుష్రా బీబీ దోషులుగా తేలడంతో, ఆయనకు 14 ఏళ్ల జైలు శిక్ష పడగా ఆమెకు ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఇమ్రాన్, బుష్రాలకు 10 లక్షలు, 5 లక్షల పాకిస్థానీ రూపాయల జరిమానా విధించారు. అయితే ఇమ్రాన్ దంపతులతో పాటు మరో ఆరుగురిపైనా నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో2023లో ఈ కేసు నమోదు చేసింది. లండన్‌లో ఉంటున్న పాక్ స్థిరాస్తి వ్యాపారి మాలిక్ రియాజ్ హుసేన్ నుంచి వసూలుచేసిన 19 కోట్ల పౌండ్లను బ్రిటన్ పాక్‌కు పంపగా, ఆ సొమ్మును ఇమ్రాన్ దంపతులు గోల్‌మాల్ చేశారని ఆరోపణ. దీన్ని అల్‌ఖాదిర్ ట్రస్టు కేసుగా వ్యవహరిస్తున్నారు. ఇమ్రాన్ ప్రధానిగా ఉన్నప్పుడు బ్రిటన్ నుంచి అందిన ఆ 19 కోట్ల పౌండ్లను జాతీయ ఖజానాలో జమ చేయకుండా, సుప్రీంకోర్టు గతంలో రియాజ్‌హుసేన్‌కు విధించిన జరిమానాలో కొంత మొత్తాన్ని ఆ నగదులో నుంచి కట్టడానికి అనుమతించారని అభియోగం. అయితే దీనికి బదులుగా ఇమ్రాన్ దంపతుల ట్రస్టు నెలకొల్పదలచిన అల్‌ఖాదిర్ విశ్వవిద్యాలయానికి హుసేన్ 57 ఎకరాలను బహుమానంగా ఇచ్చినట్లు చెబుతున్నారు. మరోవైపు జైలు జీవితం గడుపుతున్న ఇమ్రాన్ ఖాన్‌పై సుమారు 200కు పైగా కేసులు నమోదయ్యాయి. అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని, తనను అధికారానికి దూరంగా ఉంచేందుకు చేస్తోన్న కుట్ర అని మాజీ ప్రధాని తీవ్ర ఆరోపణలు చేశారు.

# హసీనాకు 21 ఏళ్ల జైలు శిక్ష- బంగ్లాదేశ్ కోర్టు తీర్పు

ఈ వ్యవహారంలో హసీనా అవినీతి పాల్పడినట్లు తేల్చింది. ఒక్కొక్క కేసులో ఏడేళ్ల శిక్ష ఖరారు చేస్తూ మొత్తం 21 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తున్నట్లు బంగ్లాదేశ్ కోర్టు తీర్పు ఇచ్చింది.

**అసలేం జరిగింది?**

గతేడాది జులైలో హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో నిరసనలు చెలరేగాయి. విద్యార్థుల నేతృత్వంలో చెలరేగిన ఆ తిరుగుబాటును అణిచివేసేందుకు హసీనా ప్రయత్నించారు. ఈ క్రమంలో హసీనా మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసీటీ) ఇటీవల నిర్ధారించింది. ఈ మేరకు ఆమెకు మరణశిక్ష విధించింది. అయితే ఆ నిరసనల్లో 1400 మంది మరణించగా, వేలాది మంది గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. తనకు మరణ శిక్ష విధించడంపై హసీనా స్పందించారు. ఐసీటీ తీర్పును ఖండించారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా ఏర్పడిన ప్రభుత్వం కుట్రపూరితంగా తనకు శిక్ష పడేలా చేసిందని విమర్శించారు. అయితే బంగ్లాదేశ్‌లో నిరసనలు జరుగుతున్న సమయంలో ఆమె దేశాన్ని విడిచి భారత్‌కు చేరుకొని ఆశ్రయం పొందుతున్నారు.

**భారత్ ఏమన్నదంటే!**

మరోవైపు షేక్ హసీనాకు ఐసీటీ మరణ శిక్ష విధించడంపై భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. పొరుగు దేశంగా బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో శాంతి, ప్రజాస్వామ్యం, స్థిరత్వం విషయంలో అన్ని పక్షాలతో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనవరిలో షేక్ హసీనాతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై బంగ్లాదేశ్ అవినీతి నిరోధక కమిషన్ వేర్వేరుగా కేసులు నమోదు చేసింది. దీంతో కోర్టు షేక్ హసీనా కుమారుడు సజీబ్ వాజెద్ జాయ్‌కు ఐదు సంవత్సరాలు, కుమార్తె సైమా వాజెద్ పుతుల్‌కు ఐదు సంవత్సరాల జైలు శిక్షను విధించింది. హసీనా భారత్ రావడంతో ఈ కేసును వాదించడానికి న్యాయవాది లేకుండా పోయారు. అయితే అవినీతి ఆరోపణల్లో తమ ప్రమేయం లేదని హసీనా ఆమె కుటుంబ సభ్యులు వివిధ ప్రకటనల్లో ఇదివరకే పేర్కొన్నారు. షేక్ హసీనాకు తర్వాత బంగ్లాదేశ్‌లో నోబెల్ గ్రహీత ముహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. హసీనాకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఐసీటీ కార్యాలయం చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా రాజధాని నగరం ఢాకాలో హై అలర్ట్ ప్రకటించారు. ఎవరైనా వాహనాలు తగలబెట్టేందుకు, బాంబులు విసిరేందుకు ప్రయత్నిస్తే, వారిని కాల్చివేయాలంటూ ఢాకా పోలీస్ చీఫ్ షేక్ మహమ్మద్ సజ్జత్ అలీ ఆదేశాలు జారీ చేశారు.

# రిజర్వేషన్లపై కేటీఆర్ కామెంట్స్.. సీతక్క స్ట్రాంగ్ కౌంటర్

మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. అబద్దాలకు అంబాసిడర్‌గా మారి కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బీసీలు విశ్వసించరని తెలిపారు. గత స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు చేశారని.. కానీ ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. సర్పంచుల రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్రం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అందుకోసం ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా చెప్పిందని సుప్రీం తీర్పును మంత్రి గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని సిఫార్సు మేరకు మండలం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్ల నిర్ణయం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాను బట్టి సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని తెలిపారు. అందుకే కొన్ని మండలాల్లో రిజర్వేషన్లు పెరిగినట్లుగా, మరికొన్ని మండలాల్లో తగ్గినట్లుగా పైకి కనిపిస్తున్నా, స్టేట్ యూనిట్‌గా చూస్తే ఎక్కడా రిజర్వేషన్లు తగ్గలేదని వెల్లడించారు. ఏ మండలంలో కూడా రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. రిజర్వేషన్ల ఖరారులో సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేశామని వివరించారు. సుప్రీం తీర్పును అపహాస్యం చేసినట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కుల గణన చేపట్టి పక్కాగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు.
కుల గణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం, బీసీ రిజర్వేషన్లపై సన్నాయి నొక్కులు నొక్కుతోందని వ్యాఖ్యలు చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని... అందుకోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. అసెంబ్లీలో తీర్మానం చేశామని.. జంతర్ మంతర్‌లో స్వయంగా సీఎం నేతృత్వంలో ధర్నా చేపట్టామని మంత్రి అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, కాంగ్రెస్‌ను విమర్శిస్తూ బీజేపీ బీ టీంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలు చేస్తోందన్నారు. బీసీలకు 42 శాతం సీట్లు బీఆర్ఎస్ ఇస్తుందా లేదా చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

# పార్లమెంట్‌లో 'జైహింద్', 'వందేమాతరం' నినాదాలపై ఆంక్షలు- బీజేపీపై కాంగ్రెస్ ఫైర్

- 'జైహింద్', 'వందేమాతరం' స్లోగన్స్ వద్దని నోటిఫికేషన్
- ఆ నినాదాలతో బీజేపీకి సమస్యేంటని కాంగ్రెస్ విమర్శలు

సభా గౌరవం, కార్యకలాపాల దృష్ట్యా పార్లమెంట్‌లో 'వందేమాతరం', 'జై హింద్' వంటి నినాదాలను ఉపయోగించవద్దని ఎంపీలను రాజ్యసభ సెక్రటేరియట్ ఆదేశించడంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఈ క్రమంలో అధికార బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించింది. స్వాతంత్ర్య పోరాటంలో ఉపయోగించిన ఈ నినాదాలతో గతంలో బ్రిటిష్ వారికి సమస్యలు ఉండేవని, ఇప్పుడు బీజేపీ ఆ సమస్యలను ఎదుర్కొంటోందని విమర్శించింది. నవంబర్ 24న పార్లమెంట్ లోపల లేదా వెలుపల సభా గౌరవాన్ని కాపాడేందుకు వందేమాతరం, జై హింద్ వంటి నినాదాలను ఉపయోగించవద్దని రాజ్యసభ సెక్రటేరియట్ తెలిపింది. ఇలాంటి నినాదాలను చేస్తే సభా గౌరవాలను ఉల్లంఘించినట్లేనని పేర్కొంది. ఈ నిర్ణయంపై బీజేపీపై కాంగ్రెస్ తీవ్రంగా విరుచుకుపడింది.

**'బీజేపీకి కూడా ఈ నినాదాలతో సమస్యేనా?'**

"నేను ఆశ్చర్యపోయాను. భారత నేలపై 'వందేమాతరం', 'జై హింద్' వంటి నినాదాలపై అభ్యంతరం ఏంటి? బ్రిటిష్ వారికి ఈ నినాదాలతో సమస్య ఉండేది. కానీ ఇప్పుడు బీజేపీకి కూడా ఈ నినాదాలు సమస్యగా మారాయా? స్వాతంత్ర్య పోరాటంలోని రెండు అత్యంత ప్రసిద్ధ నినాదాలను సభలో ఉచ్చరించడం తప్పుగా భావిస్తున్నారు. జై హింద్ అంటే హిందూస్థాన్ విజయం అని అర్థం. అంటే భారత్ ఎల్లప్పుడూ విజయం సాధించాలని అర్థం. ఇది స్వాతంత్ర పోరాటంలో ప్రతి భారతీయుడి హృదయం నుంచి వచ్చిన అత్యంత శక్తివంతమైన నినాదం." అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాతే వ్యాఖ్యానించారు.
"జై హింద్‌ను 1907లో కేరళలోని ట్రావెన్‌కోర్‌కు చెందిన విప్లవకారుడు చెంపకరామన్ పిళ్లై తొలిసారి పలికారు. 1914-1918 మధ్య పిళ్లై జర్మనీలో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.
విదేశాల్లో నివసించిన భారతీయ విప్లవకారులలో జై హింద్ నినాదాన్ని ఉపయోగించిన మొదటి వ్యక్తి ఆయన. 1943-44లో నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఆయన నెలకొల్పిన ఆజాద్ హింద్ ఫౌజ్ తమ నినాదంగా జై హింద్‌ను చేసుకున్నాయి. దీంతో ఈ నినాదం మరింత ప్రజాదరణ పొందింది. నేతాజీ ఆగ్నేయాసియా, జర్మనీ నుంచి ప్రసారమయ్యే తన ప్రసంగాలు, రేడియో సందేశాలన్నింటినీ జై హింద్ నినాదంతో ముగించేవారు. ఈ నినాదం లౌకికమైనది. అందరినీ ఏకం చేసేది. అందుకే నేతాజీ దీన్ని ఉపయోగించారు. "

**-సుప్రియా శ్రీనాతే, కాంగ్రెస్ అధికార ప్రతినిధి**

'నెహ్రూ వల్ల కూడా జైహింద్ నినాదం పాపులర్ అయ్యింది'
1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జై హింద్‌ను భారత సాయుధ దళాలు తమ అధికారిక వందనంగా స్వీకరించాయని శ్రీనాతే గుర్తు చేశారు. నేటికీ ఈ నినాదం భారత సైన్యం, పారామిలిటరీ దళాలు, ప్రతి భారతీయుడిలో దేశభక్తి భావాన్ని నింపుతుందని అన్నారు. దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కూడా జైహింద్ నినాదం మరింత ప్రాచుర్యం పొందేలా చేశారని తెలిపారు. ఆయన తరచుగా తన ప్రసంగాలను జై హింద్‌తో ముగించేవారని పేర్కొన్నారు.
"మన చరిత్రలో వందేమాతరం నినాదానికి, గేయానికి చాలా ప్రాధాన్యత ఉంది. 1870లో బంకించంద్ర ఛటర్జీ రాసిన దీనిని మొదట రవీంద్రనాథ్ ఠాగూర్ 1896 భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఆలపించారు.
1905లో స్వదేశీ ఉద్యమ సమయంలో ఇది ప్రజల రాజకీయ, జాతీయవాద నినాదంగా మారింది. 1906-1910 మధ్య బ్రిటిష్ పాలకులు ఈ నినాదాన్ని పదే పదే నిషేధించారు. ఈ గేయాన్ని ఆలపించినవారిని అరెస్టు చేశారు. స్వరాజ్యం కోసం నిరసనలు అయినా, స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటాల్లోనైనా వందేమాతరం అనేది స్వాతంత్ర్య సమరయోధుల పెదవులపై ఎప్పుడూ వినిపించేది. భగత్ సింగ్, ఖుదీరామ్ బోస్ వంటి విప్లవకారులు తమ విచారణ, ఉరితీసే సమయంలో కూడా వందేమాతరం నినాదాన్ని లేవనెత్తారు. 1950 జనవరి 24న భారత రాజ్యాంగ సభ వందేమాతరంను దేశ జాతీయ గేయంగా ప్రకటించింది. ఇప్పుడు ఆలోచించండి. ఈ నినాదాలతో ఎవరికి సమస్య ఉండవచ్చు? "అని సుప్రియా శ్రీనాతే వ్యాఖ్యానించారు.

**ఆ నినాదాలు చేయొద్దు : రాజ్యసభ సెక్రటేరియట్**

అంతకుముందు డిసెంబరు 1 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో రాజ్యసభ సభ్యుల హ్యాండ్ బుక్‌ను విడుదల చేసింది. సభా గౌరవం, కార్యకలాపాల తీవ్రత దృష్ట్యా థ్యాంక్స్, థ్యాంక్యూ, జై హింద్, వందేమాతరం వంటి నినాదాలు చేయకూడదని రాజ్యసభ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపీలు పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించాలని గుర్తుచేసింది. అలాగే ఇటువంటి సూచనలు జారీ చేయడం ఇదే మొదటిసారి కాదని రాజ్యసభ సెక్రటేరియట్ వర్గాలు తెలిపాయి. 2005 నవంబర్‌లో యూపీఏ నేతృత్వంలోని ప్రభుత్వం కూడా ఇలాంటి సర్క్యులర్ విడుదల చేసిందని గుర్తు చేసింది.

# నల్లచెరువులో ఆక్రమణలను మేం తొలగించలేదు... వారే వెళ్లిపోయారు: హైడ్రా

కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద తాము ఎలాంటి ఆక్రమణలను తొలగించలేదని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హైడ్రా) స్పష్టం చేసింది. చెరువు భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, పేదల గుడిసెలంటూ తప్పుడు ప్రచారం చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించింది. హైడ్రా అధికారుల కథనం ప్రకారం... చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వచ్చే సర్వే నంబర్ 176లో చెత్త సేకరించేవారు, స్క్రాప్ వ్యాపారులు తాత్కాలిక షెడ్లు వేసుకున్నారు. చెరువు ప్రాంతాన్ని ఖాళీ చేయాలని వారిని కోరగా, రెండు మూడు రోజుల క్రితమే వారు స్వచ్ఛందంగా తమ షెడ్లను తొలగించుకుని వెళ్లిపోయారు. అయితే, ఈ స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్న కొందరు కబ్జాదారులు.. సర్వే నంబర్ 180 పేరుతో ఇప్పుడు కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చారు. గతంలో ఇక్కడ ఉన్నవారి నుంచి అద్దెలు వసూలు చేసిన వారే, ఇప్పుడు వారిని అడ్డం పెట్టుకుని భూమిని కొట్టేయాలని చూస్తున్నారని హైడ్రా ఆరోపించింది. ఈ వ్యవహారంపై కొందరు హైకోర్టును కూడా ఆశ్రయించి, సర్వే నంబర్ 180 కింద తమకు నష్టపరిహారం కావాలని కోరారు. అయితే, తాము ఖాళీ చేయిస్తున్నది సర్వే నంబర్ 176 అని, చెరువులో చెత్త వేయడం వల్ల నీరు కలుషితమవుతోందని హైడ్రా కోర్టుకు వివరించింది. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. సర్వే నంబర్లను సరిచూసి, నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని సూచించినట్లు అధికారులు తెలిపారు.

# ప్రపంచానికే ఆదర్శం మన యువత.. వారి వల్లే స్టార్టప్ విప్లవం సాధ్యమైంది: ప్రధాని మోదీ

సాగుతున్నాయని కొనియాడారు. గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# కేసీఆర్ ఓఎస్డీని విచారించిన సిట్

**హైదరాబాద్ :** కొన్ని నెలలుగా స్తబ్దుగా ఉన్న ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ మళ్లీ విచారణ ప్రారంభించింది. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఓఎస్డీగా ఉన్న రాజశేఖర్ రెడ్డిని సిట్ విచారించింది. 2 గంటలు పాటు విచారణ జరిపిన పోలీసులు ఆయన స్టేట్మెంట్‌ను రికార్డ్ చేశారు. గత ఏడాది మార్చిలో అప్పటి టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు స్టేట్మెంట్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. గతంలో రాధాకిషన్ రావు స్టేట్మెంట్‌లో అప్పటి సీఎం కేసీఆర్ పేరును ప్రస్తావించారు. బీఆర్ఎస్ సుప్రీమ్‌తో పాటు ఆపార్టీ కీలక నేతలతో తరచూ సంప్రదింపులు జరిపామని రాధాకిషన్ రావు కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లో పోలీసులకు తెలిపారు.
%వాటిపై ప్రశ్నించిన సిట్ అధికారులు : మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు నియామకం, నోట్ ఫైల్, జీవోకు సంబంధించి రాజశేఖర్ రెడ్డిని విచారణ అధికారి వెంకటగిరి, జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ ప్రశ్నించినట్లుగా సమాచారం. సీఎంఓలో ప్రొసీజర్ ఎలా ఉంటుందనే దానిపై కూడా విచారణలో భాగంగా ఆయనను ప్రశ్నించినట్లుగా తెలిసింది. కాగా ప్రస్తుతం కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్ రెడ్డి విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది.
ఇటీవల హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలను చేపట్టిన సీవీ సజ్జనార్ ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసు విచారణ ఏ దశలో ఉంది? ఇప్పటి వరకు దాఖలు చేసిన ఛార్జ్ షీట్లు తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. కేసు దర్యాప్తుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్‌రెడ్డిని విచారించినట్లుగా తెలుస్తోంది. అతడి స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు.
**ఇప్పటికే పలుమార్లు విచారించిన సిట్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు, నిందితులను ఇప్పటికే పలువిడతలుగా సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం) విచారించింది. నలుగురు పోలీసు అధికారులను కూడా సస్పెండ్ చేసింది. ఈ కేసులో కీలక నిందితుడైన రాధాకిషన్ రావు రిమాండ్ రిపోర్టులో 'భారత రాష్ట్రసమితి సుప్రీం' అనే పదాన్ని వాడారు. అంటే, కేసీఆర్ ఆదేశాల మేరకే తాము ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు అప్పట్లో రాధాకిషన్‌రావు చెప్పినట్లు రిమాండ్ రిపోర్టులో ఉంది. ఈనేపథ్యం లోనే మాజీ సీఎం కేసీఆర్‌కు ఓఎస్డీగా పని చేసిన రాజశేఖర్‌రెడ్డిని విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది.
**ఫోన్ ట్యాపింగ్ కేసు పూర్తి సమాచారం :** ఈ కేసులో సిట్ అధికారులు కీలకమైన ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. చాలా కాలం నుంచి దర్యాప్తులో పురోగతి లేకపోవడంపై పలు విమర్శలు సైతం వచ్చాయి. ఓ వైపు వివిధ రాజకీయ పార్టీల నాయకుల వాంగ్మూలాలను ప్రత్యేక దర్యాప్తు బృందం ఇప్పటికే రికార్డ్ చేస్తుంది. ఇంకా కీలకమైన ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. తాజాగా కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్ రెడ్డిని విచారించింది. శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరునాడే ఎస్ఐబీలో విలువైన డేటాతో కూడిన 43 హార్డ్‌డిస్క్‌లను కట్టర్లతో ముక్కలుగా చేశారు. ఆ ముక్కలను మూసీ నదిలో పడేయడంతో పాటు కీలకమైన డాక్యుమెంట్లను కాల్చేశారు. అలాగే ఆ బృందంలోని ప్రతి సభ్యుడి ఫోన్, ల్యాప్‌టాప్‌ల్లోని డేటాను తొలగించి ఫార్మాట్ చేశారు. అయినప్పటికీ దర్యాప్తు బృందానికి చిక్కకుండా వారు తప్పించుకోలేకపోయారు.
**సిట్‌కు చిక్కిన కీలక ఆధారాలు :** కొద్ది రోజుల క్రితం సిట్ బృందానికి కొన్ని కీలక ఆధారాలు చిక్కడంతో దర్యాప్తు వేగవంతమైంది. ఇందుకు టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు(టీఎస్‌పీలు) కొంత ఆలస్యంగా పంపించిన లేఖలే ఈ దర్యాప్తును ముందుకు నడిపిస్తున్నాయి.
ప్రభాకర్ రావు బృందం అక్రమంగా ట్యాప్ చేసిన ఫోన్లకు సంబంధించిన వివరాలతో కూడిన లేఖలను టెలికాం సర్వీస్ ప్రొవైడర్స్ - టీఎస్‌పీలైన జియో, బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్ ఎస్ఐబీ ఆఫీస్‌కు పంపించాయి. అప్పటికే ప్రభాకర్‌రావు బృందం ఎస్ఐబీ నుంచి వెళ్లిపోవడంతో ఆ లెటర్స్ వారి చేతికి చిక్కలేదు. లేకపోతే ఆ ఆధారాలను సైతం మాయం చేసే వారని ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు భావిస్తున్నారు.

## ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత ఉండాల్సిందే:

# సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒకరు తప్పనిసరిగా బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సొంతంగా ఛానల్ ప్రారంభించినంత మాత్రాన ఎవరికీ జవాబుదారీగా ఉండననుకోవడం సరికాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియాకు సంబంధించిన ఓ వివాదంపై గురువారం విచారణ సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.
ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై అభ్యంతరకర ప్రశ్నలు అడిగిన ఘటనలో రణ్‌వీర్ వివాదాస్పదుడయ్యారు. ఈ కేసు విచారణకు రాగా, ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. "అసభ్యకరమైన కంటెంట్ అప్‌లోడ్ చేస్తే అది వైరల్ అవుతుంది, లక్షల మంది చూస్తారు. దీన్ని ఎలా నియంత్రిస్తారు? దేశ వ్యతిరేక కంటెంట్ పెట్టినప్పుడు దానికి సదరు క్రియేటర్ బాధ్యత వహిస్తారా?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది.
కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశం కాదని, యూజర్లు సృష్టించే కంటెంట్‌లోని లోపాలను ఇది ఎత్తిచూపుతోందని అన్నారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను వక్రీకరించకూడదని ఆయన పేర్కొన్నారు.
వాదనలు విన్న ధర్మాసనం, ఆన్‌లైన్ కంటెంట్‌ను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నప్పటికీ ఇలాంటివి ఎందుకు జరుగుతున్నాయని కేంద్రాన్ని నిలదీసింది. సోషల్ మీడియాలో వినియోగదారులు సృష్టించే కంటెంట్‌ను నియంత్రించేందుకు సరైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు కేంద్రానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది.

# టూరిస్టులకు టోకరా వేస్తున్న తండ్రీకూతురు!

**చౌక విమాన టికెట్ల పేరుతో పర్యాటకులకు టోకరా**
**ఢిల్లీలో వెలుగులోకి వచ్చిన భారీ ట్రావెల్ స్కామ్**
**తండ్రీకూతుళ్లపై పలు పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు నమోదు**
**ఓ వ్యాపారి నుంచి రూ.70 లక్షలు కాజేసిన నిందితులు**
**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్న పోలీసులు**

దేశ రాజధాని ఢిల్లీలో భారీ ట్రావెల్ మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. తండ్రీకూతుళ్లు కలిసి ఏళ్లుగా పర్యాటకులను, ట్రావెల్ ఏజెంట్లను మోసం చేస్తున్న వ్యవహారం బట్టబయలైంది. చౌక ధరలకే విమాన టికెట్లు, హోటల్ వోచర్లు ఇస్తామని నమ్మించి, వారి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను సందీప్ చౌదరి, ఆయన కుమార్తె మల్లికా చౌదరిగా గుర్తించారు. వీరు నకిలీ హాలిడే ప్యాకేజీలు, ఫేక్ బుకింగ్స్ సృష్టించి అనేక మందిని మోసగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిపై నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో చీటింగ్ కింద ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. నవంబర్ 13న న్యూ ఫ్రెండ్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు ప్రకారం, సింగపూర్ టూర్ పేరుతో ఓ బాధితుడి నుంచి నిందితులు రూ. 8 లక్షలు వసూలు చేశారు. డబ్బు తీసుకున్న తర్వాత ట్రిప్ రద్దు చేసుకోమని చెప్పి, తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారు.
గురుగ్రామ్‌కు చెందిన వ్యాపారి ఆశిష్ జైన్ కూడా వీరి చేతిలో రూ. 70 లక్షలు మోసపోయారు. తనను మల్లికా చౌదరి సంప్రదించి, వ్యాపారంలో మంచి అవకాశాలు ఉన్నాయని నమ్మించిందని ఆశిష్ తెలిపారు. "ఆమె మాటలు నమ్మి భారీగా ఎయిర్ టికెట్లు బుక్ చేశాను. నా క్రెడిట్ లైన్స్ ఉపయోగించి బుకింగ్స్ పూర్తి చేశాక, డబ్బులు మాత్రం రాలేదు. అడిగితే ఇద్దరూ ఫోన్లు ఎత్తడం మానేసి, నన్ను బ్లాక్ చేశారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.


## ఇందిరమ్మ గృహప్రవేశ వేడుకకు ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలకుర్తి నియోజకవర్గం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి



**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 27**తొర్రూర్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో, ఈర్ల ఉపేంద్ర సతీష్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ గృహప్రవేశం వేడుక గురువారం ఘనంగా జరిగింది.ఈ శుభకార్యానికి పాలకుర్తి నియోజకవర్గం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఝాన్సీ రెడ్డి నూతన గృహస్థులను అభినందించి,వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ.కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ఇందిరమ్మ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు మరియు పలువురు ముఖ్య నాయకులు బిజ్జల అనిల్ కూడా పాల్గొని, ఉపేంద్ర సతీష్ కుటుంబాన్ని ఆశీర్వదించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలి

### -మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో,తొర్రూరు ప్రతినిధి(సాంబ పస్తం),నవంబర్27:**420 హామీలతో ప్రజలను మోసగించిన కాంగ్రెస్ కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగు రీతిలో గుణపాఠం చెప్పాలని మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశానుసారం మండలంలోని వెలికట్ట గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తక్కలపల్లి దేవేందర్ రావు అధ్యక్షతన గురువారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.పార్టీ నాయకుల అభిప్రాయాల మేరకు మాజీ సర్పంచ్ బందు శ్రీనివాస్ ను బీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ మాట్లాడుతూ....ఆరు గ్యారంటీల పేరుతో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు.కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అధ్వాన్నంగా మారాయన్నారు.కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను అందిపుచ్చుకోవాలని, అభ్యర్థితో సంబంధం లేకుండా పార్టీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసేలా ప్రజలను చైతన్యపరిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుభి మోగించడం ఖాయమన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు రానున్న రోజుల్లో కేసీఆర్ సీఎం కావడానికి పునాదిగా మారుతుందన్నారు.ఎన్నికల కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను 6 గ్యారంటీల అమలుపై నిలదీయాలన్నారు.ప్రజల తరపున కొట్లాడే నాయకులకు సర్పంచుగా అవకాశం ఇవ్వాలని,బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు బత్తుల యాకయ్య,పోసాని రాములు,లింగారావు,బాలకృష్ణ, రాజారాం,కుమారస్వామి,బంధు రవి,కొమ్ము రాములు,కొమిరెల్లి,కరుణాకర్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సార్ డిజి ప్రిన్సిపల్ డాక్టర్ జాని కి నంది అవార్డు రావడం అభినందనీయం : స్టేట్ కోఆర్డినేటర్ లక్ష్మీప్రసన్న






**తొలి అక్షరం/ మిర్యాలగూడ / నవంబర్/27** నిస్వార్థపరుడు, నిరాడంబరుడు, ని గర్వి, ఉన్నత విద్యావంతుడు, పేద విద్యార్థుల ఆశాజ్యోతి, సార్ అంటే నేనున్నా అనే వ్యక్తి,ఎస్సార్ డీజి మిర్యాలగూడ ప్రిన్సిపాల్ డాక్టర్ గజకంటి జాని కి రిషిక ఫౌండేషన్ నంది అవార్డు ను అందుకున్న సందర్భంగా ఎస్ఆర్డి జి స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ లక్ష్మీ ప్రసన్న అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. ఇలాంటి అవార్డులో మరెన్నో రావాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సార్ డీజే జోనల్ ఇన్చార్జి స్నేహలత, మిర్యాలగూడ ఉపాధ్యాయుని ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి

### -టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి




**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 27**స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని టిపిసిసి ఉపాధ్యక్షురాలు, పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మండలంలోని పెద్దమంగ్య తండాలో బిఆర్ఎస్‌కు చెందిన పలువురు ఆ పార్టీకి రాజీనామా చేసి ఝాన్సీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.బిఆర్ఎస్ వార్డు సభ్యులు, నాయకులు జాటోత్ దేవా నాయక్, యకు నాయక్, లింగా నాయక్, దేవా,మోహన్ నాయక్, రమేష్ నాయక్, శ్రావణ్ నాయక్, కుమార్ నాయక్, పూల్ సింగ్ నాయక్, ధర్మా నాయక్, సుధాకర్ నాయక్ లను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ గల్లంతయిందని, నియోజకవర్గంలోని పలు మండలాల్లో సర్పంచ్ గా పోటీ చేసేందుకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముందుకు రావడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోత్ రవి నాయక్,నాయకులు జాటోత్ రాంలాల్ నాయక్, చిన్న మంగ్య నాయక్, జాటోత్ సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# చెర్లపాలెంలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్

### -కాంగ్రెస్ గూటికి గ్రామ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీలు
### -హస్తం పార్టీలోకి 100 వందమంది గులాబీ నాయకులు




**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 27**మండలంలోని చర్లపాలెం గ్రామంలో గులాబీ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. తాజా మాజీ సర్పంచ్ సట్ల నాగలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ధర్మారపు కిరణ్ తోపాటు 100 మంది బీఆర్ఎస్ నాయకులు హస్తం గూటికి చేరారు.

కాంగ్రెస్ మండల నాయకులు అనుమాండ్ల దేవేందర్ రెడ్డి, పెరటి యాకూబ్ రెడ్డి ల ఆధ్వర్యంలో గురువారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి సమక్షంలో గులాబి శ్రేణులు కాంగ్రెస్ లో చేరారు.

వారికి పార్టీ కండువాలు కప్పి ఝాన్సీ రెడ్డి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ....చెర్లపాలెం గ్రామం నుంచి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాలకుర్తి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, గ్రామంలో అభివృద్ధి మరింత పరుగులు పెట్టాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ లో చేరడం స్వాగతించదగిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 23 నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులే పంచాయతీ ఎన్నికల్లో తమకు అంతులేని బలాన్ని ఇస్తాయని అన్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మాత్రమే కాకుండా చెప్పని అనేక అంశాలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితమే బీ ఆర్ ఎస్ పతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ మద్దతుతో పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు అఖండ విజయం సాధిస్తారని జోస్యం చెప్పారు.

# నారాయణ స్కూల్ స్పోర్ట్స్ యాక్టివిటీస్ డే సంబరాలు




**తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 27**షాద్‌నగర్ పట్టణంలోని నారాయణ పాఠశాలలో జరిగిన స్పోర్ట్స్ యాక్టివిటీ డే పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం నుంచే చిన్నారుల కేరింతలు, ప్రేక్షకుల హర్షధ్వానాలు కలిసిపోతూ క్రీడాస్ఫూర్తిని మరింత ఉజ్వలంగా నిలబెట్టాయి. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులు పోటీల్లో సమానంగా పాల్గొని తమ ప్రతిభను మెరవించారు. కబడ్డీ, కోకో, రన్నింగ్ వంటి పోటీలు ప్రేక్షకులను అద్భుతంగా ఆకట్టుకున్నాయి. ప్రతి మ్యాచ్ ఉత్సాహభరితంగా కొనసాగింది.ఎడతెగని శ్రమ, సమన్వయం, గెలుపు పట్ల దృఢనిశ్చయంతో పోటీ పడ్డ విద్యార్థుల్లో ప్రతిభావంతులైన వారికి నిర్వాహకులు మొదటి, ద్వితీయ బహుమతులు మరియు ధ్రువపత్రాలు అందజేశారు. చిన్నారుల ఆటతీరులో ప్రతిబింబించిన జట్టు భావన, క్రమశిక్షణ, స్పోర్ట్స్‌మన్‌షిప్ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రశంసలు పొందింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏజీఎం వెంకట్ రెడ్డి పోటీలను ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ క్రీడలు విద్యార్థి జీవితానికి పునాది. పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యం, సమన్వయాన్ని పెంపొందించే మార్గం క్రీడలు. ఇలాంటి వేదికలు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ మాధవి ప్రసంగిస్తూ...పాఠ్యబోధనతో పాటు క్రీడలు కూడా సమగ్ర విద్యలో భాగమని, విద్యార్థుల వ్యక్తిత్వాభివృద్ధికి నారాయణ సంస్థ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు.భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో క్రీడా కార్యక్రమాలను నిర్వహించి మరిన్ని ప్రతిభావంతులను వెలికితీసే దిశగా ముందుకు సాగనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రీనా గుప్తా, ఏవో శ్రీధర్, వైస్ ప్రిన్సిపల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు.నారాయణ ప్రీమియర్ లీగ్ విద్యార్థుల్లో పోటీ భావం, క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పదిలపరిచిందని నిర్వాహకులు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి సిద్ధం

# మద్యం, డబ్బు, బిర్యానీలు, నా నుంచి ఆశించకండి.

### ఏఐఎస్ఎఫ్ యువ నేత ఆకాష్ నాయక్ స్పష్టం



**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 27** జిల్లేడు చౌదర్‌గూడా మండలంలోని చింతకుంట తండా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏఐఎస్ఎఫ్ యువ నేత ఆకాష్ నాయక్ ముందుకు వచ్చారు. ప్రజాసేవను లక్ష్యంగా పెట్టుకుని రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు.ఎన్నికల ప్రచార ప్రక్రియలో ప్రజలతో మాట్లాడిన ఆకాష్ నాయక్ మాట్లాడుతూ...ఈ ఎన్నికల్లో మద్యం, డబ్బు, బిర్యానీలు, ఇతర సౌకర్యాలు నా ద్వారా ఎవ్వరూ ఆశించవద్దు. నేను కొనుగోలు ఓట్లకు వ్యతిరేకం. మీ సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి కోసం నిజాయితీతో పని చేయడం నా ధ్యేయం అని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలు పరిష్కరించడంలో 100% రాజీలేని పోరాటం చేస్తాను.

చెడు వ్యసనాలకు బానిసలు చేసే రాజకీయాలు నాకు దూరం. అభివృద్ధి చేసేదే నాయకుడు, ప్రజల పక్షాన నిలబడేదే నాయకుడు. అలాంటి నాయకుని ఎన్నుకునే బాధ్యత ఓటర్లదే అని అన్నారు.ఆకాష్ నాయక్ తన ప్రచారంలో యువత, మహిళలు, రైతులతో భేటీ అవుతూ గ్రామ స్థాయి సమస్యలను తెలుసుకుంటూ నడుస్తున్నారు.ప్రజలకు చేరువ అవుతూ అభివృద్ధి పట్ల తన దృక్పథాన్ని తెలియజేస్తున్నారు.అలాగే ప్రజలను విజ్ఞప్తి చేస్తూ...మీ ఓటును అమ్ముకోవద్దు. ఓటు అంటే బాధ్యత. మీ ఓటును అమ్మితే భవిష్యత్తు అంధకారంలోకి నెట్టినట్టే. సమాజం పట్ల అవగాహన, అభ్యుదయ భావాలు ఉన్న నాయకులను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.

## పంచకట్టు వేడుకలో ఆశీర్వదించిన మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదల్ల యాదవ రెడ్డి

### నూతన వస్త్ర%-%ఫల పుష్పాలంకరణ పంచకట్టు కార్యక్రమానికి విశిష్ట అతిథుల రాక చిన్నారులను ఆశీర్వదించిన నాయకులు



**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్ 27**అమూల్య గార్డెన్, నెల్లికుదురు వద్ద నిర్వహించిన. బొమ్మినేని లావణ్య%-%అజయ్ దంపతుల కుమార్తె చి. పరిణిత శ్రీ, కుమారుడు చి. అశ్వాక్ సాయి నూతన వస్త్రా %-% ఫల పుష్పాలంకరణ పంచకట్టు వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ప్రత్యేక అతిథిగా హాజరైన మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదల్ల యాదవ రెడ్డి చిన్నారులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

అలాగే మాజీ జడ్పీటీసీ హెచ్చు వెంకటేశ్వర్లు కూడా పాల్గొని కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో నాయిని శ్రీపాల్ రెడ్డి, పెరుమాండ్ల తిలక్ బాబు, అరుణ్ కుమార్, సట్ల యాకయ్య, జగన్ బాబు, సోమయ్య, యాకయ్య, ప్రవీణ్ కుమార్, పులి శ్రీను, నరసయ్య, సోమయ్య, బొంబాయి యాకయ్య, గౌరీ శంకర్, జి. శ్రీను, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ యుటిఎఫ్ జిల్లా సభను విజయవంతం చేయాలి




**తొలి అక్షరం/ మిర్యాలగూడ/ నవంబర్ 27**వేములపల్లి:ఈనెల 30న జరిగే టీఎస్ యుటిఎఫ్ జిల్లా సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా విఫోటి టి.కన్వీనర్ దాసరి ప్రభాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఈనెల 30న తిప్పర్తి లో జరిగే యుటిఎఫ్ జిల్లా సభ గోడపత్రిక, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయ , విద్యా రంగ సమస్యలపై యుటిఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు హాజరై సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బైరం బాలరాజు, కార్యదర్శి ఎం రమాదేవి, ఎం సుమన్ ,బి రమేష్ ,రమణారెడ్డి, యాదమ్మ, ఫిర్దోస్, విజయభాస్కర్, నాగశ్రీ ,నాగమణి, జానయ్య, వెంకటరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహ విముక్తి భారత్ పోస్టర్ ఆవిష్కరణ






**తొలి అక్షరం / మిర్యాలగూడ/ నవంబర్ /27**మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస నగర్ మోడల్ స్కూల్ లో "జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ అశ్రీత స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా 100 రోజుల కాంపెయిన్ లో భాగంగా రూపొందించిన బాల్య వివాహ విముక్త భారత్ పోస్టర్ ను మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రజిత ఆవిష్కరించారు,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహ "నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయి కి 21 సంవత్సరాలు నిండ కుండా వివాహం చేసినట్లయితే చట్ట ప్రకారం 1లక్ష రూపాయల జరిమానా2 సంవత్సరాల జైలు శిక్ష తో పాటు పెళ్ళికి సహకరించే పూజారి/పాస్టర్, క్యాటరర్లు, బ్యాండ్ బజావాలాస్, హాల్వాయి, ప్రింటర్లు విరందరూ కూడ నేరం కిందిక పరిగనింప బడతారన్నారు, బాల్య వివాహాలు జరగకుండ సంహకరించవలసిన భాద్యత సమాజం లో ప్రతి ఒక్కరిపై ఉందని ఆశ్రిత సంస్థ సామజిక కార్యకర్త జి. కవిత అన్నారు.కార్యక్రమంలో సూపర్వైజర్ వాణి, నిహారిక, డి సి పి యు రమణి, ఆశ్రిత ఝాన్సీ,తదితరులు పాల్గొన్నారు

### స్థానిక సంస్థల ఎన్నికలకు యువత సిద్ధంగా ఉండాలి
### గ్రామాల అభివృద్ధి యువతతోనే సాధ్యం
### బహుజన్ సమాజ్ పార్టీ రామన్నపేట మండల అధ్యక్షులు నకిరేకంటి నరేష్



తొలి అక్షరం/రామన్నపేట రానున్న స్థానిక సంస్థలు ఎన్నికలకు యువత సన్నార్థం కావాలని, రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొంగకుండా, మహనీయులను, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత అత్యధికంగా బరిలో నిలిచి, గ్రామాల అభివృద్ధి యే యువతతో సాధ్యమవుతుందని ప్రజలను చైతన్యం పరుస్తూ, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమం అనేది విద్యార్థి, నిరుద్యోగ యువతతోనే ఉప్పెనెల ఎగిసిపడి యావత్ తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో యువత పాత్ర అమోఘం, అద్భుతమని నరేష్ అన్నారు తెలంగాణ ఉద్యమాన్ని, మహనీయుల స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో అందరికీ ఆదర్శంగా ఉంటూ, ఎలాంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా, నాయకుల మాటలకు వారి ప్రలోభాలకు లొంగకుండా గ్రామాల అభివృద్ధి యువతతోనే సాధ్యమవుతుందని ప్రతి ఒక్క యువతి యువకులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేసి యువ శక్తి సత్తా ఏంటో నిరూపించుకోవాలని నకిరేకంటి నరేష్ అన్నారు....

# "స్వరంతో సంచలనం వార్తా ప్రపంచాన్ని తనదైన ముద్రతో తాకిన మౌనిక"



పలు ప్రముఖ ఛానళ్లలో చరిత్ర సృష్టించిన స్వర దేవత

అవార్డులు, అభినందనలు, అపార ప్రజాభిమానంతో శిఖరాలకు చేరుకున్న మౌనిక

**తొలి అక్షరం ఇనుగుర్తి నవంబర్ 27**

వార్త చదవడం ఒక కళ అయితే%ొ% ఆ కళను అమృతంలా వినిపించడం మౌనిక ప్రత్యేకత. టెలివిజన్ తెర మీద ఆమె స్వరం వినిపించిన క్షణం, ప్రేక్షకులు వార్తను వినడం కాదుఅది అనుభవిస్తారు. నిగూఢత, నిగారింపు, నిబద్ధతతో చదివే ఆమె ప్రతి వాక్యం శ్రోతల హృదయాల్లో నేరుగా తాకుతుందంటే ఆశ్చర్యం లేదు.

అనేక ప్రముఖ న్యూస్ ఛానళ్లలో వరుసగా తన మాంత్రిక స్వరంతో కొత్త ప్రమాణాలు సృష్టించిన మౌనిక, దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన అరుదైన వార్తా వాచకురాలిగా నిలిచింది. వందలాది వార్తలు చదివినా ప్రతి ఒక్క వార్త కూడా కొత్తదనంతో, ప్రత్యేకతతో, జీవంతో ఉండేలా చేయడం ఆమెకు సహజసిద్ధమైన నైపుణ్యం. ప్రతిభకు ప్రతిస్పందనగా అనేక పురస్కారాలు వరుసగా ఆమెను పలకరించాయి. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి అవార్డులు మాత్రమే కాదు%ొ% ప్రజల నుంచి లభించిన అభిమానం, గౌరవం, ప్రేముఇవన్నీ ఆమె అసలైన శిఖరాలు.

# జిల్లాస్థాయి ఎల్టా ఆంగ్లభాష పోటీలకు ఎంపికైన నెక్కొండ మండల విద్యార్థులు.

**తొలిఅక్షరం/ నెక్కొండ మండలం నవంబర్ 27.** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ వరంగల్ శాఖ వారు తెలంగాణ రాష్ట్ర విద్య మరియు పరిశోధన మండలి మరియు భారతి ఎయిర్టెల్ ఫౌండేషన్ వారి సహకారంతో నెక్కొండ మండలంలోని అన్ని జిల్లా పరిషత్, మోడల్ మరియు కేజీబీవీ పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మండల స్థాయిలో ఇంగ్లీష్ ఒలంపియాడ్ మరియు ఎడ్యుక్వెస్ట్ సీనియర్ మరియు జూనియర్ విభాగాలలో పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,నెక్కొండ నందు నిర్వహించారు. ఈ పోటీలలో ఇంగ్లీష్ ఒలంపియాడ్ విభాగంలో మాలోతు హారిక, ఆడెపు ఇందు, ఎండి సోఫియా మరియు ధరావత్ మణికంఠ విజేతలుగా నిలిచారు. ఎడ్యుక్వెస్ట్ విభాగంలో బి నందిని, ఎన్ రాధిక, బి గ్రేసి మరియు ఆర్ నిహారికలు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు ఈ పోటీల విజేతలకు సర్టిఫికెట్ ప్రధానోత్సవ సభలో జడ్పిహెచ్ఎస్ నెక్కొండ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి శ్రీదేవి పాల్గొని విజేతలను అభినందిస్తూ ఇలాంటి పోటీలు విద్యార్థులలో ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంపొందుటకు దోహదపడతాయని తెలిపారు అలాగే ఎల్టా వారి కృషిని అభినందించారు ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు మరియు ఎల్టా వరంగల్ శాఖ




అధ్యక్షులు అయిన వంగర లక్ష్మణ్, జి ఉప్పలయ్య, ఎం. ఐలయ్య ఇతర పాఠశాలల నుండి గైడ్ టీచర్స్ గా వ్యవహరించిన ఉపాధ్యాయులు బి సుదర్శన్, నరసింహులు మరియు ఆర్ సునీత పాల్గొన్నారు.

# మిర్యాలగూడ నియోజకవర్గం మాడుగులపల్లి మండలం 13 గ్రామపంచాయతీలకు విస్తృతస్థాయి సమావేశం

### అన్ని గ్రామపంచాయతీలలో గులాబీ జెండా ఎగరవేయాలి మాజీ MLA నల్లమోతు భాస్కర్ రావు

**తొలి అక్షరం /మాడుగులపల్లి/నవంబర్ 27:** మాడుగులపల్లి మండలం మిర్యాలగూడ నియోజకవర్గానికి సంబంధించిన 13 గ్రామ పంచాయతీలకు గురువారం మిర్యాలగూడ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు స్థానిక ఎన్నికల భాగంలో విస్తృతస్థాయిలో సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశానికి మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగత రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో గ్రామపంచాయతీల వ్యవస్థ నిర్వీర్యం అయిందని.. అదేవిధంగా ఆనాడు కెసిఆర్ హయాంలో గ్రామ పంచాయతీలు సంపూర్ణ అభివృద్ధిని పొంది పరిశుభ్రత గాని హరితహారం లో భాగంగా చెట్ల పెంపకం గాని సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం, కంపోస్టు షెడ్లు, గ్రామీణ క్రీడా కేంద్రం, పల్లె ప్రకృతి వనం, స్మశాన వాటికలు తదితర రంగాలలో కేసీఆర్ గారు అభివృద్ధి చేసిన విషయం మనందరికీ తెలిసిందే.. అదే అభివృద్ధిని కొనసాగించాలంటే బిఆర్ఎస్ పార్టీకి, కెసిఆర్ గారికి మాడ్గుగులపల్లి మండలంలోని ఉన్న 13 గ్రామపంచాయతీలలో పూర్తిస్థాయిలో గెలిపించి మన మద్దతును తెలుపాలని కోరారు. అదేవిధంగా ఈ మాయమాటల చేతకాని రేవంత్ ఏదైతే ఆనాడు ఎన్నికలలో ఇచ్చిన 6 గ్యారంటీలు కావచ్చు లేదా 420 హామీలు కావచ్చు ఏ ఒక్కటి కూడా అమలుపరచకుండా కాలయాపన చేసుకుంటూ తన సీఎం సీటును కాపాడుకోవడం కోసం ఇప్పటికీ దాదాపు 56 సార్లు ఢిల్లీకి వెళ్లిన విషయం మనందరికీ తెలిసిందే..అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోని క్యాబినెట్ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నడుస్తోందని..ఈ చేతకాని ప్రభుత్వాన్ని చెంపపెట్టుగా మనం అన్ని గ్రామ పంచాయతీలలో గులాబీ జెండాలను ఎగురవేసి బిఆర్ఎస్ పార్టీ మద్దతుదారులను గెలిపించాలని కార్యకర్తలకు నాయకులకు సూచించారు.. ఈ కార్యక్రమంలో పాలుట్ల బాబయ్య, ఎండి. మోసిన్ అలీ, మిర్యాల మధుసూదన్ రావు, జేరిపోతుల రాములు గౌడ్ ,కర్ర ఇంద్రారెడ్డి ,మారుతి వెంకట్ రెడ్డి, కూరేళ్ల వెంకటాచారి,






అలుగుబెల్లి గోవిందరెడ్డి, పద్మ ,సుధాకర్ నాయక్ అన్ని గ్రామాల మాజీ సర్పంచ్లు, మాజీ వార్డు సభ్యులు, గ్రామ %దీ=ా% శాఖ అధ్యక్షులు ,కార్యదర్శులు ,సోషల్ మీడియా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# శ్రీ చైతన్య ఆర్జెసి స్కూల్‌లో సోషల్ వీక్ సంబరాలు

### వన్ వరల్డ్, మెనీ ఫ్లాగ్స్ ఫెస్ట్‌లో పిల్లల ప్రతిభ ఇంటర్నేషనల్ ఫ్లాగ్ ఫెస్ట్‌లో విద్యార్థుల సృజనాత్మకత, చురుకుదనం ఆకట్టుకుంది రాష్ట్రం నుండి ప్రపంచం వరకుజ్ఞానవిస్తరణే కార్యక్రమం లక్ష్యం: ప్రిన్సిపాల్ రవి

**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్ 27**

శ్రీ చైతన్య కరికులం ఆర్జెసి స్కూల్‌లో సోషల్ వీక్ సెలబ్రేషన్స్ ఘనంగా కొనసాగుతున్నాయి. ఆ కార్యక్రమాల్లో భాగంగా నాల్గవ రోజు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫ్లాగ్ ఫెస్ట్ ు వన్ వరల్డ్, మెనీ ఫ్లాగ్స్ కార్యక్రమం విద్యార్థుల సంబరాలతో సందడిగా సాగింది. ప్రపంచ దేశాల జెండాలతో చిన్నారులు చేసిన ప్రదర్శనలు అందరినీ



ఆకట్టుకున్నాయి. అదనంగా నిర్వహించిన క్విజ్ ప్రోగ్రామ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రవి మాట్లాడుతూ, "మన రాష్ట్రానికి సంబంధించిన విషయాలతో పాటు ప్రపంచవ్యాప్త అంశాలపై పిల్లల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం" అని పేర్కొన్నారు. ఇన్‌చార్జి మనీ మాట్లాడుతూ, "భవిష్యత్ తరానికి దారి చూపించే జ్ఞానాన్ని సులభంగా అర్థమయ్యే విధంగా పిల్లలకు అందించడమే మా లక్ష్యం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్, శ్రీవిద్య గారు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఏజీఎం చేతన్ గారు కూడా పిల్లల ఉత్సాహాన్ని ప్రశంసించారు. అనంతరం ప్రిన్సిపల్ రవి జోనల్ కోఆర్డినేటర్ పార్వతీ ఇన్‌చార్జి మనీ , ప్రైమరీ విభాగ ఉపాధ్యాయ బృందం మరియు చిన్నారులు కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## స్థానిక ఎన్నికల్లో

## బి ఆర్ ఎస్ సత్తా చాటాలి : రెడ్యా నాయక్



**తొలి అక్షరం దంతాలపల్లి నవంబర్ 27** రాబోయే స్థానిక ఎన్నికల్లో బి ఆర్ ఎస్ మద్దతుదారులను గెలిపించి సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు దంతాలపల్లి మండలం ఆగ పేట గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నిక లో కార్యకర్తలు అందరూ కృషితో పార్టీదారులను గెలిపించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు

## బలవంతపు ఏకగ్రీవాల రద్దు - రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

### ఫిర్యాదులపై విచారణకు పర్యవేక్షణ విభాగం - రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు - ఫిర్యాదు వస్తే నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు అభ్యర్థులు ధ్రువీకరణ పత్రం రాసి ఇవ్వాలి

తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో బలవంతపు ఏకగ్రీవాల ఫలితాలను నిలిపివేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక స్థానానికి ఒకే అభ్యర్థి నామినేషన్ వేసిన పక్షంలో అక్కడ పదవుల వేలంపాట, బెదిరింపు, ప్రేరణ, ఒత్తిడి, బలవంతపు ఉపసంహరణలు జరిగినట్లు ఏవైనా ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి, నిజమని తేలితే ఫలితాలను ప్రకటించవద్దని సూచించింది.

స్వీయ ధ్రువీకరణ పత్రాలు రాయించుకున్న తర్వాతే ఫలితాలు : ఫిర్యాదులు రాని పక్షంలో నామినేషన్లు ఉపసంహరించుకున్న, ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థులతో స్వీయ ధ్రువీకరణపత్రాలు రాయించుకున్న తర్వాతే ఫలితాలు వెల్లడించాలని సూచించింది. పలు గ్రామాల్లో పదవుల వేలం, బలవంతంగా నామినేషన్ల ఉపసంహరణ జరుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని ఇలాంటి వాటిని నిరోధించి పూర్తిగా స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను నిర్వహించాలని కోరింది.

ఫిర్యాదులు వస్తే విచారణ తర్వాత తుది నిర్ణయం : ఈ పంచాయతీ ఎన్నికల సమయంలో ఏకగ్రీవ ఎన్నికలపై లిఖితపూర్వకంగా, మౌఖికంగా, వాట్సప్ ద్వారా ఫిర్యాదులు వచ్చినా అలానే వార్తాపత్రికల్లో ప్రచురితమైనా వాటిపై విచారణ జరిపి నిర్ణయం తీసుకునేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ విభాగాన్ని ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. దీనిపై ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో నామినేషన్లు ఉపసంహరించుకున్న అభ్యర్థులు స్వచ్ఛందంగా నా అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుంటున్నానని ఎలాంటి భయం, బెదిరింపు, వేలంపాట ఒత్తిడి, ఆర్థిక ప్రేరణకు గురికాలేదని పేర్కొంటూ ధ్రువీకరణ పత్రం రాసి ఇవ్వాలి.

ఇది జిల్లా ఎన్నికల అథారిటీ, ప్రత్యేక పర్యవేక్షణ విభాగం నుంచి ఈ నివేదిక అందిన అనంతరమే ఎన్నిక ఫలితాన్ని ప్రకటించాలి. ఫిర్యాదు అందితే పర్యవేక్షణ విభాగం 24 గంటల్లోపు విచారణ జరిపి ఆయా గ్రామ పంచాయతీలు, వార్డులలో ఎన్నికను రద్దు చేయాలని సిఫార్సు చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక అందించాలి.

పోటీ చేసేందుకు సింగరేణి ఉద్యోగులకు అవకాశం : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సింగరేణి ఉద్యోగులకు అవకాశం లభించింది. ఎన్నికల సంఘం సింగరేణి ఉద్యోగులు పోటీ చేయవచ్చని ఇటీవల వెల్లడించడంతో పోటీకి సిద్ధమవుతున్నారు. గతంలో సింగరేణి ఉద్యోగులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేశారు. కొంత కాలంగా యాజమాన్యం ఉద్యోగుల పోటీపై అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎన్నికల్లో పోటీ చేస్తే ఉద్యోగానికి రాజీనామా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో చాలా కాలంగా స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంటున్నారు. 15 ఏళ్లుగా యాజమాన్యం ఉద్యోగులు పోటీ చేయకుండా నియంత్రిస్తోంది.

వారం గడువు మాత్రమే సమయం : పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఇచ్చిన షెడ్యూల్‌లో అభ్యర్థుల తుది జాబితా ప్రకటన అనంతరం ప్రచారానికి వారం గడువు మాత్రమే సమయం మిగులుతోంది. సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు నామపత్రాల ఉపసంహరణ పూర్తి అవ్వగానే పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారాన్ని నిర్వహిస్తుంటారు.ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ మేరకు వారం రోజుల గడువు మాత్రమే నెలకొనడంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. రెబల్స్, ఇతర అంశాలపై నామినేషన్ల ఉపసంహరణపై దృష్టి సారించడానికే సమయం సరిపోయే పరిస్థితి నెలకొనడంతో ఈసారి ఆందోళన తప్పడం లేదు.

## సీఎంను మార్చాల్సిన అవసరం లేదు- ఐదేళ్ల పదవిని నా తండ్రి పూర్తి చేస్తారు : యతీంద్ర సిద్ధరామయ్య

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై చర్చలు జరుగుతున్న వేళ సీఎం కాంగ్రెస్ ఎమ్మెల్యే, సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎంను మార్చాల్సిన అవసరం లేదని, ఆ పదవిలో తన తండ్రి పూర్తి స్థాయిలో కొనసాగుతారని తెలిపారు. సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య అధికార భాగస్వామ్య ఒప్పందం గురించి తనకు తెలియదని పేర్కొన్నారు. విలేకర్లతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

'నా అభిప్రాయం ప్రకారం ముఖ్యమంత్రిని మార్చాల్సిన అవసరం లేదు. సిద్ధరామయ్య పూర్తిస్థాయి ముఖ్యమంత్రిగా కొనసాగతారు. నేతృత్వ మార్పు ఎందుకు మళ్లీ మళ్లీ చర్చకు వస్తుందో నాకు తెలియదు. అధికారణ పంపిణీ విషయంలో ముందుగా ఏదైనా ఒప్పందం జరిగింది కూడా నాకు తెలియదు. అయినప్పటికీ, హైకమాండ్ నిర్ణయమే తుది నిర్ణయం. అధికార భాగస్వామ్యం గురించి నాకు ఎవరూ చెప్పలేదు. ఎమ్మెల్యేలు దిల్లీలో లాబీయింగ్ చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇది ఇతర పార్టీల్లో కూడా జరిగింది. మేమంతా హైకమాండ్ నిర్ణయానికే కట్టుబడి ఉన్నాం. మార్పు అవసరం లేదు. అవసరంలేని చర్చలు ఉండకూడదు. హైకమాండ్ అన్ని విషయాలు పరిశీలించి ఉత్తమ నిర్ణయం తీసుకుంటుంది' అని యతీంద్ర తెలిపారు.ఇదిలా ఉండగా నాయకత్వ మార్పు గురించి వస్తున్న ఊహాగానాలను డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తోసిపుచ్చారు. ఏ విషయంలోనూ తొందరపడటం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి పదవి గురించి కాంగ్రెస్ సీనియర్ నాయకులతో ఎటువంటి చర్చలు జరపలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కలవలేదని అన్నారు. ముంబయికి బంధువుల కార్యక్రమానికి వచ్చినట్లు విలేకర్లుతో తెలిపారు. ఇక్కడ ఎలాంటి సమావేశం జరగలేదని పేర్కొన్నారు.

# మిస్టర్ లెజెండ్ బాడీ బిల్డర్ పోటీలు షాద్ నగర్ కే గర్వకారణం

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### షాద్ నగర్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్

### ఛాంపియన్‌షిప్ పోటీల పోస్టర్లు కరపత్రాలను విడుదల చేసిన ఎమ్మెల్యే

### ఛాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా హాజరుకానున్న బాడీ బిల్డర్లు

### ఎమ్మెల్యే శంకర్ ను సన్మానించిన జిమ్ ట్రైనర్లు అబ్దుల్ ఖాదర్ జిలాని, మహమ్మద్ హబీబుద్దిన్

### డిసెంబర్ 21న బుగ్గారెడ్డి గార్డెన్ లో రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్ పోటీలు






**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 27**జీవితంలో ఆరోగ్యం కన్నా గొప్ప సంపద సృష్టిలో ఏది లేదని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని, శరీర సౌష్టవాన్ని పెంచుకోవాలని తద్వారా దీనిని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు వచ్చేందుకు "మిస్టర్ లెజెండ్" పేరిట బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ లాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వగృహంలో "మిస్టర్ లెజెండ్" టైటిల్ పేరిట రాష్ట్రస్థాయి బాడీ బిల్డర్స్ ఛాంపియన్షిప్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ తదితర కరపత్రాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా విడుదల చేశారు. పట్టణ కాంగ్రెస్ సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోస్టర్లు కరపతులను విడుదల చేసిన అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. శరీర సౌష్టవాన్ని (బాడీ బిల్డింగ్) నేటి యువతీ యువకులు పెద్ద ఎత్తున ముందుకు వస్తుండడం శుభ పరిణామం అని అన్నారు. షాద్ నగర్ ఇలాంటి ప్రాంతంలో ప్రజల ఆరోగ్యం కోసం జిమ్స్ ఏర్పాటు చేసి వాటి ద్వారా యువతీ యువకులను ప్రోత్సహిస్తూ బాడీ బిల్డింగ్ పోటీలను రాష్ట్రస్థాయిలో ఇక్కడ నిర్వహించడం ఎంతో గొప్ప విషయం అని ఈ కార్యక్రమానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు. డిసెంబర్ 21వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమై ఈ కార్యక్రమానికి తనను ముఖ్యఅతిథిగా జిమ్ ట్రైనర్లు అదేవిధంగా కార్యక్రమాల నిర్వహకులు అబ్దుల్ ఖాదర్ జిలాని, మహమ్మద్ హాబీబుద్ధిన్ లు తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందని అన్నారు. పహిల్వాన్ల పోటీలు ఎంతో రసవతారంగా ఉంటాయని వారి శరీర సౌష్టవాన్ని చూసేందుకు చాలామంది ఆసక్తి కనబరుస్తారని రాష్ట్రస్థాయిలో ఈ పోటీలు స్థానికంగా జరగడం మంచి పరిణామం అని అన్నారు. యువతీ యువకులు కచ్చితంగా తమ ఆరోగ్యాల పై శ్రద్ధ పెట్టాలని జిమ్ ట్రైనర్లు చెప్పే విధంగా నడుచుకొని బాడీ బిల్డింగ్ చేయాలని ఇక్కడి స్థానిక యువతీ యువకులు బాగా కష్టపడి ఈ ప్రాంతానికి పేరు తీసుకురావడం సంతోషంగా ఉందని అన్నారు.

**రాష్ట్రస్థాయిలో ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నాం**

మిస్టర్ లెజెండ్ పేరిట రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు షాద్ నగర్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నిర్వాహకులు, ఎస్ఎం ఫిట్నెస్ క్లబ్స్ ట్రైనర్లు అబ్దుల్ ఖాదర్ జిలాని, మహమ్మద్ హబీబుద్ధిన్ మీడియాకు వివరించారు. డిసెంబర్ 21వ తేదీన జరిగే ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు బాడీ బిల్డర్లను పెద్ద ఎత్తున ఆహ్వానించడం జరిగిందని ఆయన క్లబ్బులకు సంబంధించిన అనేకమంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా బాడీ బిల్డింగ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా 25వేల రూపాయలు, రెండు బహుమతిగా 15 వేల రూపాయలు, అదేవిధంగా మూడో బహుమతి కి కూడా నగదు పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొన్న వారికి ధృవపత్రాలతో పాటు మెడల్స్ అందజేస్తామని తెలిపారు. ఎంట్రీ ఫీజు మాత్రం 1500 రూపాయలు ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ పోటీలకు షాద్ నగర్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మొహమ్మద్ ఆసిఫ్, 4కే ఫిట్నెస్ క్లబ్ మహబూబ్ నగర్ కు చెందిన మధుకర్ రెడ్డి, డి ఎలైట్ జిమ్ నిర్వాహకులు ముస్తాక్ హుస్సేన్, కింగ్ జిమ్ నిర్వాహకులు మహమ్మద్ ఖాసిం, అల్ఫా జిమ్ మహేష్, ఆర్ఎల్ఎం ఫిట్నెస్ క్లబ్ శివ, ఏ వన్ టూ స్టార్ జిమ్ చేగురు నిర్వాహకులు యాదయ్య, కొత్తూరు ఫిట్నెస్ క్లబ్ నిర్వాహకులు అరుణ్ కుమార్, స్టార్ జిమ్ నందిగామ నిర్వాహకులు మహమ్మద్ రియాజ్, ఎస్ఎం ఫిట్నెస్ క్లబ్ నిర్వాహకులు అర్షద్ అలీ, జేపి ఫిట్నెస్ క్లబ్ నిర్వాహకులు మొహమ్మద్ రవూఫ్ తదితరులు కార్యక్రమానికి హాజరవుతారని ఇంకా అనేక మంది ప్రముఖులు స్థానికులు ఈ కార్యక్రమానికి హాజరవుతానని వారు పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన కరపత్రాలు పోస్టర్లను విడుదల చేసినందుకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అదే విధంగా యువ నాయకుడు చెంది తిరుపతి రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు షకీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురు జనాభాకు ఒక సర్పంచ్, ముగ్గురు వార్డు మెంబర్లు - ఎన్నిక నిలిపివేసిన హైకోర్టు



: రాష్ట్రంలో స్థానిక ఎన్నికల ప్రక్రియ జోరందుకుంది. నామినేషన్ దాఖలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పలుచోట్ల రిజర్వేషన్లపై రగడ నడుస్తోంది. వరంగల్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్ పట్నం గ్రామంలో కేవలం ఆరుగురు ఎస్టీ జనాభా ఉంటే వారికి సర్పంచి పోస్టుతో పాటు 3 వార్డులను కేటాయించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. 2025 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకోకుండా, 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్‌లు కేటాయించడం సరికాదని తెలిపింది.

ఈ విషయంపై సమర్పించిన వినతిపత్రాలపై నిర్ణయం తీసుకునేదాకా మహమూద్‌పట్నం పంచాయతీ ఎన్నికలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఇచ్చింది. మహమూద్‌పట్నం సర్పంచి పోస్టును ఎస్టీ మహిళకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ మిట్టగడుపుల యాకూబ్ హైకోర్టులో అత్యవసరంగా లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టారు.పిటిషనర్ తరఫు న్యాయవాది రమేశ్ చిల్లా వాదనలు వినిపిస్తూ గ్రామంలో 2025 ఓటర్ల జాబితా ప్రకారం 576 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అందులో ఎస్టీలు ఆరుగురేనని హైకోర్టుకు వివరించారు. వీరికి సర్పంచి పోస్టుతో పాటు 3 వార్డులను రిజర్వు చేశారని పేర్కొన్నారు. 250 మంది ఎస్సీలు, 300 మంది బీసీలు, 20 మందికి పైగా ఓసీలు ఉన్నారని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయిస్తూ ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎస్సీ జనరల్ మహిళకు కేటాయించిన అధికారులు, ఇప్పుడు ఎస్టీలకు కేటాయించారని కోర్టుకు వివరించారు.

అప్పటి వరకూ ఎన్నిక లేదు : దీనిపై ఇచ్చిన వినతిపత్రాలపై చర్యలు తీసుకోలేదని ధర్మాసనం ముందు న్యాయవాది వాదనలు వినిపించారు. దీంతో వినతి పత్రాలపై చర్యలు తీసుకునేదాకా మహమూద్‌పట్నం పంచాయతీ ఎన్నికను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు విచారణను డిసెంబరు 29కి వాయిదా వేశారు. వీటితో పాటు రిజర్వేషన్‌లను సవాల్ చేస్తూ పలు పిటిషన్‌లపై విచారించిన న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

బీసీలకు 23 శాతం కూడా రిజర్వేషన్లు లేవు : బీసీ రిజర్వేషన్‌లకు సంబంధించి వివాదం ప్రధాన న్యాయమూర్తి బెంచ్‌లో పెండింగ్‌లో ఉన్నందున ఉత్తర్వులు ఇవ్వడం లేదన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ బీసీలకు 23 శాతం కూడా కేటాయించలేదని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు కేటాయించిన అనంతరం బీసీలకు రిజర్వేషన్ లు ఉంటాయని చెప్పారు.వారి తర్వాతే ఇతరులకు రిజర్వేషన్లు : ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగపరంగా రిజర్వేషన్‌లు లభించాయని, వారి తర్వాతే ఇతరులకు రిజర్వేషన్‌లు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని ఆయన వాదనలు వినిపించారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఈ పిటిషన్‌లలో ఎంతవరకు జోక్యం చేసుకోవాలో శుక్రవారం పరిశీలిస్తామని చెప్పారు.తెలంగాణ స్థానిక ఎన్నికల షెడ్యూల్ : పంచాయతీ ఎన్నికలు 3 విడతల్లో నిర్వహించనున్నారు. డిసెంబరు 11, 14, 17వ తేదీల్లో నిర్వహించేందుకు తెలంగాణ ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడితో పాటు ఉప సర్పంచి ఎన్నికను సైతం నిర్వహించనున్నారు.

## ఈవీఎంలు తనిఖీ చేయాలని ఎవరూ ఫిర్యాదు చేయలేదు: ఈసీ

: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, ఇతర రాష్ట్రాల్లోని ఉప ఎన్నికల్లో ఈవీఎం మెమొరీ, మైక్రో కంట్రోలర్ కాలినట్లు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎన్నికల సంఘం వెల్లడించింది. బిహార్‌లోని 243, పలు రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఓడిన అభ్యర్థులు ఎవరూ ఈవీఎంలు తనిఖీ చేయాలని అడగలేదని తెలిపింది. "ఇటీవల జరిగిన బిహార్ శాసనసభ ఎన్నికలు 2025 ఎన్నికలు, 8 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాలిపోయిన మెమరీ/మైక్రోకంట్రోలర్‌ను తనిఖీ చేయాలని ఏ అభ్యర్థి నుంచి దరఖాస్తు అందలేదు." అని ఈసీ పేర్కొంది.యితే, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు %జుఎవీ%ల కాలిపోయిన మెమరీ/మైక్రోకంట్రోలర్ లెక్కింపు తర్వాత తనిఖీ, ధృవీకరణపై సవరించిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని (%ూశీ%) జూన్ 17న జారీ చేసినట్లు %జుజ×% తెలిపింది. దీని ప్రకారం ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు పోలైన అభ్యర్థి తర్వాతి స్థానాల్లో ఉన్న నంబర్ 2 లేదా నంబర్ 3 అభ్యర్థులు ఫలితం ప్రకటించిన ఏడు రోజుల్లోపు %జుఎవీ%లను తనిఖీ చేయడానికి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పింది.బిహార్ అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన ఈసీ పలు విషయాలను తెలిపింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాల్లో (మొత్తం 1,215 పోలింగ్ కేంద్రాలు) %ఎపూాు% స్లిప్‌లను లెక్కించామని, ఎక్కడా %జుఎవీ% లెక్కింపుతో వ్యత్యాసం రాలేదని వివరించింది. బిహార్‌లోని 38 జిల్లాలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టిన తర్వాత 12 గుర్తింపు పొందిన పార్టీలు లేదా ఓటర్ల నుంచి తొలగింపు, నమోదుపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని చెప్పింది. ఇంకా 2,616 మంది అభ్యర్థులు, 12 గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల్లో ఎవరూ కూడా రీ పోలింగ్ నిర్వహించాలని కోరలేదని పేర్కొంది. బిహార్ ఎన్నికలు, వివిధ రాష్ట్రాల్లోని 8 ఉపఎన్నికలు నిర్వహించిన 72 గంటల్లోనే ఇందుకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచామని తెలిపింది. ఎన్నికల ముగిసిన ఐదు రోజుల్లోనే గణాంకాలతో సహా పూర్తి వివరాలను ఉచితంగా ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

# రెడీమేడ్ విజయం





రెడీమేడ్ విజయం చదివింది ఏడో తరగతి. వారసత్వం లేదు. అనుభవం లేదు. మనుగడ కోసం పోరాటమే ఆ గృహిణిని ఆంత్రప్రెన్యూర్‌గా మార్చింది. టైలరింగ్‌తో మొదలై రెడీమేడ్ గార్మెంట్స్ తయారీ వరకూ ఆమె ప్రయాణం ఓ స్ఫూర్తిపాఠం.

చదివింది ఏడో తరగతి. వారసత్వం లేదు. అనుభవం లేదు. మనుగడ కోసం పోరాటమే ఆ గృహిణిని ఆంత్రప్రెన్యూర్‌గా మార్చింది. టైలరింగ్‌తో మొదలై రెడీమేడ్ గార్మెంట్స్ తయారీ వరకూ ఆమె ప్రయాణం ఓ స్ఫూర్తిపాఠం. నిజామాబాద్ జిల్లాకు చెందిన లత.. లక్షలకొద్దీ ఆర్డర్లను స్వీకరిస్తూ వేలకొద్దీ యూనిఫామ్‌లు తయారు చేస్తున్నారు. వ్యాపారాన్ని ఎలా విస్తరించాలో తెలియని పరిస్థితుల్లో వీహబ్ నేర్పిన బిజినెస్ పాఠాలు ముందుకు నడిపించాయని చెబుతారు లత.

నిజామాబాద్ జిల్లా కోరుట్ల మండలంయూసఫ్ నగర్ మా సొంతూరు. ఊళ్లోనే ఏడో తరగతి వరకూ చదువుకున్నా. ఎనిమిదో క్లాసుకు పట్టణానికి వెళ్లాలి. చాలా దూరం. బస్సులో ప్రయాణించాలి. మాది నిరుపేద కుటుంబం. అంత స్తోమత లేదు. దీంతో చదువు మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం ఎందుకని టైలరింగ్ నేర్చుకున్నా. ఆ ఫీజు కట్టడానికి కూడా చెవి కమ్మలను తాకట్టు పెట్టాల్సి వచ్చింది. ఆతర్వాత క్రమక్రమంగా బ్లౌజులు, చిన్న పిల్లల డ్రెస్సులు కుట్టడం నేర్చుకున్నా. టైలరింగ్‌లో పట్టు సాధించాక మరికొందరికి నేర్పించడం మొదలుపెట్టాను. అంతలోనే నా పెండ్లి జరిగిపోయింది. నా భర్త దేవేందర్ ఉద్యోగం కారణంగా నిజామాబాద్‌కు వచ్చేశాం. రెండేండ్లపాటు ఇంట్లో ఖాళీగా ఉన్నా. కొన్ని కారణాల వల్ల నా భర్త ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చింది. ఇల్లు గడవడం కష్టమైన పరిస్థితుల్లో నేను నేర్చుకున్న టైలరింగే నాకు ఉపాధి మార్గం చూపింది.

### డ్రెస్సుల ఆర్డర్లతో మొదలై..

ఓ బట్టల దుకాణంలో చిన్నపాటి ఉద్యోగం దొరికింది. దుస్తులు కుట్టి షాప్‌కు పంపడం నా బాధ్యత. కానీ, దానికి ఓ కుట్టు మెషీన్ అవసరమైంది. అప్పు చేసి కొన్నాం. నెలనెలా ఏడువేల రూపాయల వరకూ వచ్చేది. పాప పుట్టాక ఖర్చులతోపాటు అవసరాలు పెరిగాయి. నా భర్త స్కూళ్లకు వెళ్లి బెల్టులు, టైలు, ఐడీ కార్డుల తయారీ కోసం ఆర్డర్స్ తెచ్చేవారు. క్రమంగా స్కూల్ యూనిఫామ్ ఆర్డర్స్ రావడం మొదలైంది. ఇక వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. మా వ్యాపారం రెండువేల మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగింది.

### కరోనాతో కొత్త మలుపు

అనేక ప్రాణాలను బలితీసుకున్న కరోనా.. నా జీవితాన్ని మాత్రం మార్చేసింది. అమాంతంగా మాస్కులకు గిరాకీ పెరగడంతో.. పెద్ద ఆర్డర్ వచ్చింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు.. పదిహేను రోజుల్లో లక్ష మాస్కులు కుట్టాలని అధికారులు చెప్పారు. ఆర్డర్ అయితే వచ్చింది కానీ, అంత పెట్టుబడి డబ్బు మా దగ్గర లేదు. ఏం చేయాలో పాలుపోలేదు. బంగారాన్ని తాకట్టు పెట్టి డబ్బు తెచ్చాం. మెషినరీ సమకూర్చుకుని సకాలంలో సరుకు అందించాం. మొత్తంగా మూడు లక్షల రూపాయల లాభం. పెద్ద మొత్తమే! ఆ తర్వాత 20వేల మంది ఆశా వర్కర్స్‌కు బ్లౌజ్‌లు కుట్టే ఆర్డర్ వెతుక్కుంటూ వచ్చింది. నా శ్రమను గుర్తించి కేఎంసీ అనే సంస్థ రూ.10 లక్షల విలువైన మెటీరియల్ క్రెడిట్‌గా ఇచ్చి ప్రోత్సహించింది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు మూడు లక్షల యూనిఫామ్స్ కుట్టే అవకాశమూ దక్కింది. అప్పుడే లతా గార్మెంట్స్ పేరుతో నాలుగు శాఖలు ప్రారంభించాను. తక్కువ ధరలోనే నాణ్యమైన ఫ్యాషన్ వస్త్రాలు అందించాలన్నది నా ఆశయం. కస్టమర్ సంతోషమే నా విజయ రహస్యం. కుటుంబ బాధ్యతలు, పేదరికం.. ఎదుగుదలకు అవరోధాలు కానేకావు. ఇందుకు నా జీవితమే ఉదాహరణ.

### 'వీ హబ్' తోడ్పాటు ..

వ్యాపార వృద్ధిలో నా భర్త వెన్నంటి నిలిచారు. 'వీ హబ్' ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యాను. వివిధ రంగాల నిపుణులు అకౌంటింగ్, మార్కెటింగ్, ట్యాక్సేషన్‌కు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. కరోనా సమయంలో నా దగ్గర పనిచేసిన వారికి వంట సామగ్రి అందించి ఆదుకున్నా. ఏదైనా ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని పేద విద్యార్థుల చదువుకు సహకారం అందించాలన్నది నా ఆశయం. ఈ సత్కార్యానికి త్వరలోనే కార్యరూపం తెచ్చే ప్రయత్నం చేస్తున్నా. సృజన మహిళ సొంతం. పట్టుదల ఆమె ఆభరణం. నాయకత్వ లక్షణాలు జన్మతః అబ్బుతాయి. కావాల్సిందల్లా ప్రోత్సాహం. వీహబ్ లాంటి వేదికలు మహిళా ఆంత్రప్రెన్యూర్స్‌ను ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయి.

# టిక్..టిక్..టిక్ ఫ్యాషన్ ట్రిక్!



సమయానికి తగిన ఫ్యాషన్ ఫాలో కావాలనే అనుకుంటారు ఎవరైనా. కానీ, ఫ్యాషన్ మాత్రం సమయంతో పోటీ పడుతూ ఉంటుంది. కాలమంత వేగంగా మారిపోతూ ఉంటుంది. సమయానికి తగిన ఫ్యాషన్ ఫాలో కావాలనే అనుకుంటారు ఎవరైనా. కానీ, ఫ్యాషన్ మాత్రం సమయంతో పోటీ పడుతూ ఉంటుంది.

కాలమంత వేగంగా మారిపోతూ ఉంటుంది. కాబట్టే, కాలాన్నీ ఫ్యాషన్‌నూ ఓ చోటుకు చేర్చి.. వాచ్ ఇన్‌స్పైర్డ్ జువెలరీ తయారు చేస్తున్నారు డిజైనర్లు.పట్టుచీర కట్టుకోవాలన్నా, నగలు పెట్టుకోవాలన్నా సమయమూ సందర్భమూ కలిసిరావాలి.

జీన్సుకూ వేళాపాళా అవసరమే. కానీ వీటన్నిటినీ టైమ్‌కి తగినట్టు పాటించాలంటే మన దగ్గర ఓ వాచ్ అంటూ ఉండాలి. అది చేతికే ఉండాలా, మెడలో ఉండకూడదా? చెవి దుద్దుగా అమరిపోకూడదా? వేలి ఉంగరంలో ఇమిడిపోకూడదా?.. అందుకే ముద్దుగుమ్మ చెవికి అందాల కమ్మగా, నాజూకైన వేలికి ముద్దులొలికే అంగుళీకంలా, సింగారాల మెడలో బంగారు లాకెట్‌లా అందమైన వాచీలు దర్శనమిస్తున్నాయి. ఈ టిక్ టిక్ సొగసులు.. కనికట్టు చేసి మరీ ఎదుటివాళ్లు కాలాన్ని మరిచిపోయేలా చేస్తున్నాయి. రాళ్లూ పూసలతో పార్టీలుక్ తెచ్చే వాచీలూ ఉన్నాయి. మనం కొనుక్కునేందుకే కాదు, బహుమతిగా ఇచ్చేందుకూ బాగుంటాయి. కాబట్టి మీరూ టైమ్ చూసి పడేయండి. ఆర్డరు!

# క్రాప్ టాప్.. లెహంగా



క్రాప్ టాప్.. లెహంగా అసలైన పార్టీలుక్ రావాలంటే క్రాప్‌టాప్ ధరించాల్సిందే. అప్పుడే భారతీయత ఉట్టిపడేలా కనిపిస్తూనే, మోడ్రన్ మెరుపుల్నీ మెరిపించవచ్చు. అలాంటి ప్రత్యేక సందర్భాల కోసం రూపొందించిందే ఈ ఫ్యూజన్ వైట్ లెహంగా క్రాప్‌టాప్.ఆఫ్‌వైట్ ఆర్గంజా వస్త్రాన్ని ఎంచుకొని నాజూకైన ఫ్లోరల్‌హ్యాండ్ ఎంబ్రాయిడరీ చేశారు.

అసలైన పార్టీలుక్ రావాలంటే క్రాప్‌టాప్ ధరించాల్సిందే. అప్పుడే భారతీయత ఉట్టిపడేలా కనిపిస్తూనే, మోడ్రన్ మెరుపుల్నీ మెరిపించవచ్చు. అలాంటి ప్రత్యేక సందర్భాల కోసం రూపొందించిందే ఈ ఫ్యూజన్ వైట్ లెహంగా క్రాప్‌టాప్.ఆఫ్‌వైట్ ఆర్గంజా వస్త్రాన్ని ఎంచుకొని నాజూకైన ఫ్లోరల్‌హ్యాండ్ ఎంబ్రాయిడరీ చేశారు.క్రాప్‌టాప్‌తో పాటు నడుము పట్టీమీదా వచ్చిన ఈ డిజైన్‌ను ఊదా, గులాబీ, ఆలివ్ గ్రీన్, బంగారు, వెండి వర్ణాల కలయికతో కళాత్మకంగా రూపొందించారు. నడుము దగ్గర రెండువైపులా రిబ్బన్లు అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి.

# మా ఊరే.. నా ఇల్లు



మా ఊరే.. నా ఇల్లు ముదిత.. నేర్వగరాని విద్య లేదు, సాధించలేని విజయమూ లేదు. ఇంటిని తీర్చిదిద్దిన చేతులతోనే గ్రామాన్నీఅభివృద్ధి చేయగలదు. పోపు డబ్బాలో పొదుపు చేసుకున్న చిల్లర పైసలతో బిడ్డలను ప్రయోజకులను చేసినట్టే, వృథాను అరికట్టి, చెత్తను ఒడిసిపట్టి బంగారంగానూ మార్చేయగలదు.

ముదిత.. నేర్వగరాని విద్య లేదు, సాధించలేని విజయమూ లేదు. ఇంటిని తీర్చిదిద్దిన చేతులతోనే గ్రామాన్నీఅభివృద్ధి చేయగలదు. పోపు డబ్బాలో పొదుపు చేసుకున్న చిల్లర పైసలతో బిడ్డలను ప్రయోజకులను చేసినట్టే, వృథాను అరికట్టి, చెత్తను ఒడిసిపట్టి బంగారంగానూ మార్చేయగలదు. ఆ అచ్చమైన నాయకత్వ లక్షణమే ఆదిలాబాద్ జిల్లాలోని ముక్రా (కే)సర్పంచ్ గాడ్గే మీనాక్షిని 'స్వచ్ఛ సుజల్ శక్తి సమ్మాన్'కు అర్హురాలిని చేసింది. 'మా పల్లెను నా ఇల్లుగా భావించాను. ఇంటిని తీర్చిదిద్దినట్టే గ్రామాన్నీ తీర్చిదిద్దాను' అంటారామె.

ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలి. సర్పంచ్‌ను చూసి గ్రామ ప్రగతిని అంచనా వేయాలి. ఇల్లాలు గుణవంతురాలైతే ఇల్లు స్వర్గం. సర్పంచ్ పనిమంతురాలైతే గ్రామం పరిశుభ్రం. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) గ్రామం ముత్యంలా మెరుస్తున్నదంటే.. కారణం సర్పంచ్ గాడ్గే మీనాక్షి చొరవే. ఆమె దృష్టిలో ఇల్లు పల్లెలో భాగం కాదు.. పల్లె మొత్తం ఆమె ఇల్లు కిందే లెక్క. చెత్తాచెదారం కనిపిస్తే.. చికాకు పడిపోతారు. వెంటనే శుభ్రం చేయిస్తారు. మురుగు వాసన ముక్కుపుటాల్ని తాకితే మహోగ్రరూపం ధరిస్తారు. సిబ్బందికి చివాట్లేస్తారు. ఎక్కడ ఉండాల్సిన వస్తువులు అక్కడ ఉండాల్సిందే. చిందరవందరగా పడుంటే తానే సర్దేస్తారు. బుద్ధిమంతులైన విద్యార్థుల చేతిరాతను తలపించేలా పంచాయతీ రికార్డులు ఉండాలంటారు. ఇంట్లో బల్బు వృథాగా వెలుగుతున్నా, ఫ్యాన్ అనవసరంగా తిరుగుతున్నా అమ్మకు కోపం వచ్చేస్తుంది. సర్పంచమ్మనూ ధర్మాగ్రహం ఆవహిస్తుంది. పంచాయతీ పరిధిలో కరెంటు వృథా అయినా, నల్లా నీళ్లు వీధిపాలైనా అసలు తట్టుకోలేరు. కుటుంబానికైనా, పంచాయతీకైనా ఆర్థిక వనరులే ఆధారం. ఆ విషయంలో మీనాక్షికి ముందుచూపు ఎక్కువ. కాబట్టే, సేంద్రియ ఎరువుల తయారీతో గ్రామానికి అదనపు ఆదాయాన్ని సమకూర్చవచ్చనే ఆలోచన స్ఫురించింది. సర్పంచ్, ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు.. ఇలా అన్ని వైపుల నుంచీ అందిన కృషి ఫలించింది. ముక్రా (కే) ఆదర్శ పంచాయతీగా పేరు తెచ్చుకుంది.

### గెలుపు కథ..

ముక్రా(కే) గ్రామాన్ని ప్రభుత్వం పంచాయతీగా ప్రకటించాక.. 2019 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో గ్రామస్తులు గాడ్గే మీనాక్షిని సర్పంచ్‌గా ఎన్నుకున్నారు.. అదీ ఏకగ్రీవంగా. అప్పటి నుంచి గ్రామాభివృద్ధిలో ఆమె తనదైన పాత్ర పోషిస్తూనే ఉన్నారు. గ్రామంలో రెండొందల గడపలు ఉన్నాయి. వెయ్యికిపైగా జనాభా. ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తారు మీనాక్షి. దాంతోపాటు తాగునీరు, రహదారులు, మురుగునీటి వ్యవస్థ.. తదితర ప్రాథమిక సౌకర్యాలకు పెద్దపీట వేస్తున్నారు. ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించారు. ప్రతి ఇంటికి ఇంకుడుగుంత ఏర్పాటు చేయించారు. నీటి వినియోగం ఉన్న దగ్గరంతా ఇంకుడు గుంతలు తవ్వించారు. ఆ వ్యక్తిగత కృషికి సర్కారు సహకారం తోడైంది. అందులోనూ 'పల్లె ప్రగతి' కార్యక్రమం గ్రామ రూపురేఖలు మార్చేసింది. పచ్చదనం, పరిశుభ్రత మెరుగుపడ్డాయి. మొక్కల పెంపకానికి పెద్దపీట వేశారు. హరితవనం, పల్లెప్రకృతి వనం.. పచ్చదనానికి పట్టం కట్టాయి. వైకుంఠధామం.. చివరి యాత్ర సజావుగా సాగేందుకు దోహదపడుతున్నది.

### చెత్త కాదు బంగారమే

డంపింగ్‌యార్డు, సెగ్రిగేషన్ షెడ్.. చెత్త సమస్యను పరిష్కరించాయి. ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్ ద్వారా రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి.. డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అందులోని తడిచెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు. దీనివల్ల మూడేండ్లలో రూ.7 లక్షల ఆదాయం సమకూరింది. ఆ ప్రగతి ప్రయాణమే అనేక పురస్కారాలను సంపాదించిపెట్టింది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ 'దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సశక్తీకరణ్', 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులిచ్చింది. కేంద్ర పర్యావరణ శాఖ 'జీవవైవిధ్య పురస్కారం' ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ విభాగాలలో ప్రతిభ కనబరచిన మహిళలకు కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛ సుజల్ శక్తి సమ్మాన్' పురస్కారం అందిస్తుంది. ఈ ఏడాది గ్రామ పరిశుభ్రత విభాగంలో సర్పంచ్ గాడ్గే మీనాక్షిని ఎంపిక చేశారు. మార్చి 4న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమెకు అవార్డు అందజేస్తారు. 'ఇది అందరి విజయం. ప్రతి పల్లెకూ ప్రగతి పాఠం' అంటారు మీనాక్షి.

### 'పల్లె ప్రగతి'తోనే సాధ్యమైంది

తెలంగాణ సర్కారు అమలు చేస్తున్న 'పల్లెప్రగతి' కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి ఊతమిస్తున్నది. ప్రతి పల్లె పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడుతున్నది. మా గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. సేంద్రియ ఎరువుల తయారీ వల్ల పంచాయతీకి ఆదాయం సమకూరుతున్నది.


**– గాడ్గే మీనాక్షి, సర్పంచ్ ముక్రా(కే)**

# హిట్ బ్యూటీ హాటు ఫోజులు తట్టుకోవడం కష్టమే..!



చిలసౌ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయిన బ్యూటీ రుహాని శర్మ. ఆ సినిమాలో చాలా పద్ధతిగా కనిపించిన ఈ ముద్దుగుమ్మ నటనతో ఆకట్టుకుంది. ఆ సినిమాలో ఆమె నటన కు అందరూ ఫిదా అయిపోయారు. ఆ సినిమాకి ఆమెకు ఉత్తమ డెబ్యూ నటిగా సైమా అవార్డు కూడా అందుకుంది. ఆ తర్వాత హిట్ మూవీలో కూడా మెరిసింది. ఇక ఆ తర్వాత నుంచి సోషల్ మీడియాలో హీట్ నెస్ పెంచుతూ వస్తోంది.తాను గ్లామర్ రోల్స్ కూడా చేయగలను అని నిరూపించేందుకు తన ప్రయత్నాలు పెంచుతోంది. వరసగా సినిమాలు వెబ్ సిరీస్ లలో అవకాశాలు చేజిక్కించుకుంటూ ముందుకు దూసుకుపోతోంది.తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోల కు నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. గ్లామరస్ పిక్స్ తో కుర్రాళ్లని ఆకర్షిస్తోంది. సోషల్ మీడియాలో రుహాని జోరు చూస్తుంటే రోజు రోజు ఆమె అందం రెట్టింపు అవుతోందనిపిస్తోంది. తాజాగా బ్లాక్ కలర్ డ్రెస్ లో ఉన్న ఫోటోలను షేర్ చేసింది. అందులో తన ఎద అందాలను మొత్తంగా ఆరబోసింది. ఒంటికి అతుక్కుపోయినట్లుగా ఉండే డ్రెస్ లో మరింత హాట్ గా కనిపిస్తుంది. డ్రెస్ కి మ్యాచింగ్ జ్యువెలరీ మరింత అందం తీసుకువచ్చింది. ఈ ఫోటోకి ఇప్పటి వరకు 70వేల కు పైగా లైకులు రాగా కామెంట్ల వర్షం కురుస్తోంది. హాట్ క్యూట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. లుక్స్ తో కిల్ చేస్తోంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఆమెకు ఇన్ స్టాగ్రామ్ లో 1.2 మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. గతంలో 1 మిలియన్ ఫాలోవర్స్ ని చేరుకున్నప్పుడు స్పెషల్ ఫోటోని షేర్ చేసింది. తన ఆనందాన్ని ఫోటోలతో తన ఫాలోవర్స్ తో పంచుకుంది. రుహాని శర్మ చివరగా శ్రీనివాస్ అవసరాల నటించిన నూటొక్క జిల్లాల అందగాడు చిత్రంలో నటించింది. ఈ చిత్రం ఆశించిన మేరకు సక్సెస్ కాలేదు. ఒక టాప్ ప్రొడక్షన్ హౌస్ నిర్మించే చిత్రంలో రుహాని నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై త్వరలోనే అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# అషురెడ్డి క్లీవేజ్ షో బాగోలేదా..?




బిగ్ బాస్ తెలుగు రియాల్టీ షోతో గుర్తింపు తెచ్చుకున్న అషురెడ్డి అందాలను ఆరబోస్తూ రచ్చ చేస్తోంది. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్ గా ఉంటూ వరసుగా పోస్టులు పెడుతుంటుంది. తనకు సంబంధించిన పర్సనల్ తో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకుంటుంది. రోజుకో రకమైన ఔట్ ఫిట్ లో దర్శనం ఇస్తూ కుర్రుకారు గుండెల్లో హీటు పుట్టిస్తుంటుంది.సోషల్ మీడియాలో అందాలు ఆరబోయడమే పనిగా పెట్టుకున్న ఈ ముద్దుగుమ్మ.. తాజాగా ఇన్ స్టా వేదికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది.

అయితే అందులో క్లీవేజ్ షో చేస్తూ కొన్ని ఫొటోస్ పెట్టింది . ఎద అందాలు చూపిస్తూ పిచ్చెక్కించాలనుకుంది. కానీ ఫొటోలకు వస్తున్న కామెంట్లు చూసి ఆమె పిచ్చెక్కిపోయేలా చేస్తున్నారు నెటిజెన్లు. ఫోటో షూట్స్ పెట్టిన ప్రతీ సారి పొగడాలని లేనట్టు కొన్ని సార్లు ట్రోల్ కూడా చేస్తున్నారు ఆమె ని ఫాలో అయ్యే వ్యూయర్స్ .నీ క్లీవేజ్ ఏం బాగా లేదని కొందరు.. ఆ అందాలను ఆరబోయడం అవసరమా అని మరి కొందరు చెబుతున్నారు. ఇలా ఉన్నావేంటమ్మా తల్లి ఆపు ఇంక.. అందాల ఆరబోత అంటూ కామెంట్లు చేస్తున్నారు. నిన్ను చూడలేక చస్తున్నాం తల్లో అంటూ ట్రోల్స్ చేస్తున్నారు. మరికొందరేమో అదిరిపోయావు చాలా హాట్ గా ఉన్నావు హాట్ నెస్ ఓవర్ లోడెడ్ అంటూ చెబుతున్నారు.

బిగ్ బాస్ తో వచ్చిన క్రేజ్ ఆధారంగా సినిమాల్లో అవకాశాల కోసం చాలానే కష్ట పడుతోంది క్యూట్ బ్యూటీ. కానీ అనుకున్నట్లుగా ఛాన్సులు దక్కించుకోలేక పోతుంది. అయితే సినిమాల్లో అవకాశాల కోసమే అషు రెడ్డి ఈ రేంజ్ లో నెట్టింట అందాలు ఆరబోస్తుందని అంతా అనుకుంటున్నారు. ఈ మధ్య చాలా మంది ఇదే ట్రెండ్ ను ఫాలో అవుతున్నారు. సోషల్ మీడియాలో తమ ఫొటోలను పెడుతూ అందరి దృష్టి తమపై పడేలా చేసుకుంటున్నారు. చివరగా అషురెడ్డి ఫోకస్ అనే క్రైమ్ థ్రిల్లర్ సినిమాలో పోలీస్ ఆఫీసర్ గా నటించింది. ప్రస్తుతం ఎ మాస్టర్ పీస్ అనే చిత్రంలో నటిస్తూ బిజీగా గడుపుతోంది. అలాగే మరిన్ని చిత్రాల్లో ఈమె చిన్న చిన్న పాత్రలు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఈమె అందాల ఆరబోతతో ఏమైనా మంచి క్యారెక్టర్లు దక్కించుకుంటుందో లేదో.

# రెడ్ హాట్ మలైకా మంటలు కాదు.. ఇది అంతకు మించి!



మలైకా అరోరా ఖాన్.. బాలీవుడ్ సహా అన్ని పరిశ్రమల్ని ఊపేస్తున్న బ్యూటీ. లేటు వయసులోనూ ఘాటు అందాలతో కవ్వించడం అమ్మడి ప్రత్యేకత. 50 ఏళ్లకు చేరువలో ఉన్నా? నవ నాయికలా మీడియాలో ఎప్పటికప్పుడు ఫోకస్ అవుతుంది. కుర్రాళ్ల గుండెల్లో గుబులు పుట్టిస్తుంది. ఈ సంచనాలన్ని ఓ ఎత్తైతే!

బాలీవుడ్ యంగ్ హీరో అర్జున్ కపూర్ తో ఘాటైన ప్రేమాయణం సాగిస్తూ అంతకు మించి మరింత పాపులారిటీని మూటగట్టుకుంది. ఈ ఏడాది పెళ్లికి రెడీ అవుతోందన్న ప్రచారంతో ఒక్క సారిగా సన్నివేశం హీటెక్కింది. ఎఫైర్ వార్తల కు హాట్ ఫోటోషూట్లు అదనపు బోనస్ గా మారాయి. 2023ని అంతే కొత్తగా మత్తుగా స్టార్ట్ చేసింది ఈ లేటు వయసు నాటీ. ఏడాది ఆరంభమే ప్రియుడితో ఐలాండ్ లో షికార్లు చేస్తోన్న ఫోటోలు వదిలి కాకలు పుట్టించింది. రీసెంట్ గా మరో టూర్ ఫోటోలు కూడా నెట్టింట వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ బ్యూటీ తానేం చేయాలనుకుంటే అది చేస్తూ పనులన్నీ చక్కబెట్టుకుంటూ ముందుకెలుతోంది. ఇక రెగ్యులర్ బేసిస్ లో వేడెక్కించే ఫోటోషూట్లతో విరుచుకుపడే ఈ భామ తీరు పైనా యువతరం అంతే వేడిగా మాట్లాడుకుంటున్న సంగతి తెలిసిందే. తాజాగా అమ్మడు రెడ్ హాట్ లో మంటలు పుట్టిస్తోన్న ఓ ఫోటో షూట్ వీడియో నెట్టింట ప్రకంపనలు రేపుతొంది. ఇదిగో ఇలా అమ్మడు ఈవెంట్ కి హాజరవుతూ ఇలా చిక్కింది.

షోల్డర్ లెస్ డిజైన్ గౌనులో అగ్గి రాజేసే అందాలతో ఆకట్టుకుంటుంది. అమ్మడి క్లీవేజ్ షో.. నాభి అందాలు అంతకు మించి ఫోకస్ అవుతున్నాయి. వీపు వైపు ఉండాల్సిన కిటికీలు..ముందు బాగాన ఫోకస్డ్ ఏరియాలోనే ఉండటంతో కుర్రాళ్లకు పండగ వాతావరణలా మారిపోయింది.

ఇక అడిగిన వాళ్ల కు కానదకుండా సెల్ఫీలు ఇచ్చేసింది. వెళ్లే వాళ్లని వెనక్కి తిగిరి చూసేలా ఓ నవ్వు విసిరి మరింత కవ్వించింది. మలైకాతో సెల్ఫీ అంటే ఆ మాత్రం ఉండాలి గా. కొన్నాళ్ల పాటు గుర్తుండిపోవాలి గా. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది.

# ఆ స్టార్ హీరోలు కాలు కదిపితే కోట్లు!



బాలీవుడ్ స్టార్ హీరోలు గడప దాటి కాలు బయట పెడితే! ఖాతాలో కోట్ల రూపాయలు జమ అవుతాయి. సినిమా ద్వారా వచ్చే పారితోషికం కావొచ్చు...బ్రాండింగ్స్ ఎండార్స్ చేయడం ద్వారా వచ్చే ఆదాయం కావచ్చు...ఇతర మార్గాల ద్వారా జమ అయ్యే ఆదాయం కావచ్చు. ఇది కేవలం సెలబ్రిటీలకు..ఫేమస్ క్రికెటర్ల కు మాత్రమే సాధ్యమయ్యేది. ఇటీవలే షారుక్ ఖాన్ తనకు భారీ విజయాన్ని అందించిన పఠాన్ చిత్రంలోని 'జూమే జో' పఠాన్ పాటకు స్టెప్పులేశారు.

ఇది ఓ ప్రయివేట్ ఈవెంట్ లో చోటు చేసుకున్న సంఘటన. ఈ పాటకు డ్యాన్స్ చేసినందుకు షారుక్ ఖాన్ కు భారీగా రెమ్యునరేషన్ అందజేశారు. మీడియా కథనాల ప్రకారం..షారుక్ ఖాన్ ఒక నిమిషం పాటు స్టెప్పులేసినందుకు దాదాపు 10 కోట్ల రూపాయలు ఖాతాలో జమ అయ్యాయ్యన్నది నెట్టింట సంచలనంగా మారింది. ఆయనతో పాటు స్టెప్ అందుకున్న వరుణ్ ధావన్.. రణ్వీర్ సింగ్ కూడా బాగానే జమ చేసుకున్నారు.

అలాగే ఇటీవల ఓ వెడ్డింగ్ లో హృతిక్ రోషన్ కూడా డాన్స్ చేసిన ఓ వీడియో నెట్టింట జోరుగా వైరల్ అయింది. ఆయన హీరోగా నటించిన 'వార్' సినిమాల్లో హిట్ నెంబర్ల ను ఆలపించి కోట్లు వెనకేసాడని ప్రచారం సాగింది. 'ఘుంగ్రూ'.. ' బ్యాంగ్ బ్యాంగ్' టైటిల్ ట్రాక్ కి అంతా ఆకర్షితులయ్యారు. హృతిక్ లో ఈ ట్యాలెంట్ ఉందా? అని అంతా అవాక్కయ్యారు. ఈ ప్రదర్శనల కోసం హృతిక్ కి 2.5 కోట్ల వరకు చెల్లించినట్లు సమాచారం. దీని పై ఆన్ లైన్ కమ్యూనిటీలో పెద్ద ఎత్తున చర్చ సాగింది. ఒక్క రోజుకే 2.5 కోట్లు అంటే? ఆయన రేంజ్ ఏంటి? తదుపరి సినిమాకి ఆయన తీసుకునే పారితోషికం ఎంతై ఉంటుందంటూ? వాడి వేడి చర్చ సాగింది. ప్రస్తుతం హృతిక్ రోషన్ 'ఫైటర్'లో నటిస్తున్నాడు. ఈ సినిమాకి 85 కోట్లు తీసుకుంటు న్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి.

ఈ పారితోషికాన్ని 45 రోజుల సినిమా షూటింగ్ గా విడదీస్తే.. హృతిక్ ఒక రోజులో ఎంత సంపాదిస్తాడు? అంటే అది దాదాపు ₹2 కోట్లు ఆదాయంగా తెలుస్తుంది. ఒక సినిమాకి పారితోషికంగా అంత మొత్తం తీసుకుంటే? ఒక ఈవెంట్ కి డేట్ వైడ్ వేరు చేస్తే రోజుకు రెండు కోట్లు . ఇది అక్షరాలా హృత్తిక్ చట్టబద్ధమైన ఒప్పందంలా కనిపిస్తుంది.

# అక్కా-చెల్లెళ్ల డ్రీమ్ నెరవేరేదెప్పుడో?



స్టార్ హీరోయిన్లు అవ్వాలని ఎంతో మంది భామలు తెరంగేట్రం చేస్తుంటారు. కానీ అందులో కొందరే సక్సెస్ అవుతుంటారు. ఆ కొందరిలో మరికొంత మందే టాప్-10 లోస్థానం దక్కించుకుంటారు. లేడీ సూపర్ స్టార్లు నయనతార..త్రిష..అనుష్కలా...బాలీవుడ్ హీరోయిన్లు కరీనా కపూర్...ప్రియాంక చోప్రా.. దీపికా పదుకొణేలా అవ్వాలని ఎంత మందికి ఉండదు. కానీ అలా కొందరే కాగలరు. ఈ రంగంలో ట్యాలెంట్ తో పాటు లక్ కూడా కలిసొస్తేనే ఆ స్థానాన్ని చేరుకునేది.వారసురాళ్లే ఆస్థానలకు చేరుకుంటారు అన్నది అవాస్తవమని ఇప్పటికే ఎన్నోసార్లు రుజువైంది. ఇలా ఎన్నో ఆశలతో ఆ ఇద్దరు అక్కా-చెల్లెళ్లు కూడా తెరంగేట్రం చేసారు . వెనుక సపోర్ట్ ఉంది. అన్ని పరిశ్రమల్లోనూ పరిచయాలు ఉన్నంతలో పర్వాలేదు. ఆ కాన్ఫిడెన్స్ తో కరణ్ జోహార్ ఆధ్వర్యంలో పనిచేయడానికి ఓ డ్రీమ్ గా పెట్టుకున్నారు. తెరంగేట్రం చేసి ఐదారేళ్లు అవుతుంది. కానీ ఆ భామలిద్దరి కెరీర్ ఇంకా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే మాదిరి కనిపిస్తుంది. మాటల్లో ఉన్న కాన్ఫిడెన్స్ చేతల్లో కనిపించడం లేదు. భారీ అంచనాల మధ్య డెబ్యూ చిత్రాలతో లాంచ్ అయినా అవేవి మార్కెట్ లో నిలబడలేదు. ప్రఖ్యాత మోడలింగ్ పెస్టివల్స్ లోనూ పాల్గొన్నారు. విజతలుగా నిలవలేదు గానీ...పోటీని తట్టుకుని మాత్రం ఆస్థానానికి చేరుకోవడం ఓ అచీవ్ మెంట్ గా చెప్పొచ్చు. తాజాగా ఆ భామలిద్దరి కెరీర్ పరిశీలిస్తే గతం కన్నా మరింత డౌన్ అయినట్లే కనిపిస్తుంది. టాలీవుడ్ దర్శక-నిర్మాతలంతా పరభాషా భామా మణులకు ఇస్తోన్న ప్రాధాన్యత చూస్తుంటే వాళ్లకు అవకాశలివ్వడం కష్టంగానే కనిపిస్తుంది. మరి అలా అవకాశాలు కల్పిచక పోవడం పట్ల కారణం అభద్రతా భావమా? ఇంకేదైనా ఉందా? అన్నది ఆ పెరుమాళ్లకే తెలియాలి. వాళ్లిద్దరు ఇప్పటివరకూ లో బడ్జెట్ చిత్రాలు మినహా పెద్ద బ్యానర్లో నటించే అవకాశం ఇంకా ఒడిసిపట్టుకోలేదు. ఈ క్రమంలో తల్లిదండ్రులకు ఉన్న ఇమేజ్ ఇక్కడా వర్కౌట్ అవుతున్నట్లు కనిపించలేదు. పరిచయ చిత్రాల వరకూ కొందరు పేరున్న వారు వెనుకుండి సహకారం అందించినా అటుపై ఎక్కడా కనిపించలేదు. తాజాగా పరిశ్రమలో ఉన్న కొన్ని రకాల సంక్షోభాలు పరోక్షంగా అవకాశాల పట్ల ప్రభావం చూపిస్తున్నట్లు కనిపిస్తుంది. మరి వీటన్నింటిని దాటుకుని అక్కా-చెల్లెళ్లిద్దరు ఎలా ముందుకు సాగుతారు? అన్నది చూడాలి.